TGTEL/26/A2635

# DD9 వార్త

వాస్తవాలు పలుకు

తెలుగు దినపత్రిక

హైదరాబాద్ | సంపుటి: 02 | సంచిక: 58 | 10-07-2026 శుక్రవారం | పేజీలు: 08 | వెల: 3/-

## నేడు విద్యాసంస్థల బంద్‌కు వామపక్ష విద్యార్థి సంఘాల పిలుపు

పాఠశాలల సంఖ్య తగ్గించొద్దని డిమాండ్
విద్యాశాఖకు మంత్రి నియమించాలని విజ్ఞప్తి
ఖాళీ పోస్టులు భర్తీ చేయాలన్న డిమాండ్
ప్రైవేటు ఫీజుల నియంత్రణకు చట్టం కోరుతూ
ఇంటర్‌లో మధ్యాహ్న భోజనం అమలు చేయాలి
గురుకులాలకు సొంత భవనాల నిర్మాణం
పేదలకు 25 శాతం ఉచిత ప్రవేశాలు
ఎన్ఈపీపై అసెంబ్లీలో తీర్మానం కోరుతూ
పుస్తకాల దోపిడీని అరికట్టాలని డిమాండ్

02




# పరిశ్రమలు మొత్తం ఓఆర్ఆర్ బయటకు

కాలుష్య రహిత హైదరాబాద్ తయారు చేసుకుందాం
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడి
పరిశ్రమలు ఓఆర్ఆర్ బయటకు తరలింపు
ప్రిమియర్ ఎనర్జీస్ యూనిట్ ప్రారంభించిన సీఎం
5.6 గిగావాట్ల సోలార్ ప్లాంట్ ప్రారంభం
మూసీ, పరిశ్రమల కాలుష్యంపై ఆందోళన
ఢిల్లీ, బెంగళూరు నుంచి పాఠాలు
తెలంగాణ రైజింగ్2047 విజన్ ప్రకటించిన సీఎం
2034 నాటికి ట్రిలియన్ ఎకానమీ లక్ష్యం
యువతకు నైపుణ్యాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి
ప్రజల సహకారంతో కాలుష్య నియంత్రణ
రంగారెడ్డి జిల్లా సీతారాంపూర్‌లో సోలార్ మాడ్యూల్ తయారీ యూనిట్ ప్రారంభం



**హైదరాబాద్, (డిడి9 వార్త):**
హైదరాబాద్‌ను దేశంలోనే అత్యంత ప్రణాళికాబద్ధమైన, కాలుష్యరహిత మహా నగరంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంటోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) లోపల విస్తరించి ఉన్న 2,100 చదరపు కిలోమీటర్ల కోర్ అర్బన్ ప్రాంతాన్ని పూర్తిగా కాలుష్య రహితంగా అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ప్రకటించారు. ఇందుకోసం నగరంలోని పరిశ్రమలను దశలవారీగా ఓఆర్ఆర్ వెలుపల ఏర్పాటు చేసిన ప్రత్యేక మాన్యుఫాక్చరింగ్ జోన్‌కు తరలిస్తున్నట్లు వెల్లడించారు. రంగారెడ్డి జిల్లా సీతారాంపూర్‌లో ప్రముఖ సోలార్ సంస్థ ప్రిమియర్ ఎనర్జీస్ ఏర్పాటు చేసిన 5.6 గిగావాట్ల సామర్థ్యం గల సోలార్ మాడ్యూల్ తయారీ యూనిట్‌ను మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుతో కలిసి ముఖ్యమంత్రి ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో రాష్ట్ర భవిష్యత్ మిగతా 2లో..

## పోక్సో కేసులో బండి భగీరథ్‌కు బెయిల్..

షరతులతో అనుమతించిన హైకోర్టు
రూ.లక్ష పూచీకత్తుతో బెయిల్
సాక్షులను ప్రభావితం చేయొద్దని ఆదేశం
దర్యాప్తుకు పూర్తిగా సహకరించాలి
విచారణకు ఆటంకం కలిగించొద్దు
షరతులు ఉల్లంఘిస్తే బెయిల్ రద్దు
పలు నిబంధనలు విధించిన కోర్టు
పోక్సో కేసు విచారణ కొనసాగుతుంది
ఇటీవలే తీర్పు రిజర్వ్ చేసిన కోర్టు
భగీరథ్ బెయిల్‌పై కీలక ఉత్తర్వులు
కేసు తదుపరి విచారణ కొనసాగనుంది



**హైదరాబాద్, (డిడి9 వార్త):**
పోక్సో చట్టం కింద నమోదైన కేసులో బండి భగీరథ్‌కు తెలంగాణ హైకోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. ఇటీవల ఈ బెయిల్ పిటిషన్‌పై వాదనలు ముగిసిన మిగతా 2లో..

# కాళేశ్వరం అవినీతికి హరీశ్ రావే కారణం

టీఆర్ఎస్ చీఫ్ కవిత సంచలన వ్యాఖ్యలు
బీఆర్ఎస్ పార్టీకి కవిత బహిరంగ సవాల్
దమ్ముంటే ప్రజా సమస్యలపై పోటీ పడండి
ప్రాణమున్నంత వరకు బీఆర్ఎస్‌తో జతకట్టేదే లేదు
ఆ పార్టీతో ప్రజా క్షేత్రంలో పోరాడేందుకు సిద్ధం
చాటుమాటు రాజకీయం వీడాలన్న కల్వకుంట్ల కవిత
మీడియా కవరేజీని అడ్డుకుంటున్న కేటీఆర్, హరీశ్ రావు
ఒక ఆడబిడ్డను చూసి ఎందుకింత భయమంటూ ప్రశ్నల వర్షం




**హైదరాబాద్, (డిడి9 వార్త):**
తెలంగాణ రాష్ట్రంలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం, ప్రజల పక్షాన నిలబడి పోరాడటంలో బీఆర్ఎస్ పార్టీకి నిజంగా దమ్ముంటే తనతో పోటీ పడాలని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత బహిరంగ సవాల్ విసిరారు. గురువారం నాడు ఆమె హైదరాబాద్‌లో మీడియాతో ప్రత్యేకంగా మాట్లాడారు. తాను కొత్తగా రాజకీయ పార్టీ పెట్టుకున్న తరుణంలో.. మాకేం భయం లేదని పైకి గంభీరంగా ప్రగల్భాలు పలికిన బీఆర్ఎస్ నాయకులు, ఇప్పుడు ఎందుకు లోపల భయపడుతూ చాటుమాటుగా కేంద్ర ఎన్నికల సంఘానికి (ఈసీ) తమపై ఫిర్యాదులు చేస్తున్నారని నిలదీశారు. తమ తెలంగాణ రక్షణ సేన పార్టీకి సంబంధించిన రాజకీయ వార్తలను, కార్యక్రమాలను కవర్ చేస్తున్న ప్రముఖ దినపత్రికలు, టీవీ ఛానళ్ల యాజమాన్యాలకు బీఆర్ఎస్ అగ్ర నాయకులు కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్), తన్నీరు హరీశ్ రావు స్వయంగా ఫోన్లు చేసి బెదిరిస్తున్నారని కవిత తీవ్ర ఆరోపణలు చేశారు. తమ వార్తలు రాకుండా అడ్డుకుంటున్నారని, ఇంత సిగ్గులేని వ్యవహారాలకు ఎందుకు తెరలేపుతున్నారని మండిపడ్డారు. ఒక ఆడబిడ్డగా తాను ధైర్యంగా ప్రజల మధ్యకు వెళ్తుంటే.. తట్టుకోలేక ఆంబోతుల్లా, మిగతా 2లో..

## హరీశ్ రావుపై కేసీఆర్ కే నమ్మకం లేదు

నమ్మకం లేకే పదవి నుంచి తప్పించారు
హరీశ్‌కు ఉత్తమ్ ఘాటు కౌంటర్
కేసీఆర్ నిర్ణయాన్ని ప్రస్తావించిన మంత్రి
మంత్రి పదవిపై కొత్త వ్యాఖ్యలు
కాళేశ్వరం మరమ్మతులపై స్పష్టత
వేసవిలోగా పనులు పూర్తి
కాంగ్రెస్‌లో చేరుతారా అని ప్రశ్న
జగ్గారెడ్డి వ్యాఖ్యల ప్రస్తావన
చిత్తశుద్ధితో పనులు చేస్తున్నామన్న మంత్రి
హరీశ్ ఆరోపణలకు త్వరలో సమాధానం
బీఆర్ఎస్‌పై విమర్శలు కొనసాగింపు



**హైదరాబాద్, (డిడి9 వార్త):**
తెలంగాణ రాజకీయాల్లో ఇరిగేషన్ అంశం మరోసారి వేడెక్కింది. మాజీ మంత్రి హరీశ్‌రావు చేసిన విమర్శలకు రాష్ట్ర ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఘాటుగా బదులిచ్చారు. ఇరిగేషన్ వ్యవహారాల్లో హరీశ్‌రావు అంతటి నిపుణుడైతే, ఆయనను అప్పట్లో ముఖ్యమంత్రి కేసీఆర్ మంత్రి పదవి నుంచి ఎందుకు తప్పించారని ప్రశ్నించారు. హరీశ్‌రావుపై కేసీఆర్‌కే పూర్తి నమ్మకం లేకపోవడంతోనే ఆయనను మొదట్లో మంత్రి పదవి నుంచి తప్పించారని విమర్శించారు.గురువారం సచివాలయంలో మీడియాతో చిట్‌చాట్ సందర్భంగా ఉత్తమ్ కుమార్ రెడ్డి ఈ వ్యాఖ్యలు చేశారు. ఇటీవలి కాలంలో కాళేశ్వరం ప్రాజెక్టు, ఇరిగేషన్ మిగతా 2లో..




## మూసీ పునరుజ్జీవానికి రూ.7,345 కోట్లకు గ్రీన్ సిగ్నల్

తొలి దశకు ప్రభుత్వం అనుమతి
జోన్-1 పనులకు రూ.7,345 కోట్లు
ఏడీబీ రుణంతో ప్రాజెక్టు అమలు
హిమాయత్‌సాగర్ నుంచి బాపూఘాట్ అభివృద్ధి
ఉస్మాన్‌సాగర్ మార్గం ఆధునికీకరణ
మొత్తం 21 కిలోమీటర్ల అభివృద్ధి
మూసీ రివర్ ఫ్రంట్ బోర్డు అమలు
హెచ్ఎండీఏకు రుణాల అనుమతి
ప్రాజెక్టు కన్సల్టెన్సీకి గ్రీన్ సిగ్నల్
మూసీ పునరుజ్జీవానికి వేగం

**హైదరాబాద్, (డిడి9 వార్త):**
మూసీ నది పునరుజ్జీవ ప్రాజెక్టుకు తెలంగాణ ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. ప్రాజెక్టు తొలి దశ పనులకు పరిపాలనా అనుమతులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. జోన్ 1 పరిధిలో చేపట్టనున్న అభివృద్ధి పనులకు మొత్తం రూ.7,345 కోట్ల వ్యయానికి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో మూసీ పునరుజ్జీవ మిగతా 2లో..

## కాంగ్రెస్ పని అయిపోయింది..

కాంగ్రెస్‌పై కేటీఆర్ విమర్శలు
78 సీట్లు వస్తాయని కీలక వ్యాఖ్యలు
సర్వే నివేదికలపై సంచలన ఆరోపణలు
కేసీఆర్‌ను కోరుకుంటున్న ప్రజలు: కేటీఆర్



**హైదరాబాద్, (డిడి9 వార్త):**
తెలంగాణలో అధికార కాంగ్రెస్ పార్టీ పతనం దాదాపు ఖాయమైపోయిందని, రాష్ట్రంలో ఆ పార్టీ పని ఇక అయిపోయినట్లేనని భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. హైదరాబాద్ జిల్లా పార్టీ నేతలతో జరిగిన ముఖ్యమైన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం సగం పదవీ కాలం పూర్తి చేసుకున్న నేపథ్యంలో.. స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డే తన పరిపాలన, నాయకత్వంపై ఒక విస్తృతమైన సొంత సర్వే చేయించుకున్నారని కేటీఆర్ వెల్లడించారు. ఆ సర్వేలో ప్రస్తుత ప్రభుత్వంపై తీవ్రమైన ప్రజా వ్యతిరేకత చాలా స్పష్టంగా వ్యక్తమైందని ఆయన పేర్కొన్నారు.

**సర్వేల ఫలితాలు.. బీఆర్ఎస్ ప్రభంజనం**
ఇదే సమావేశంలో పలు సర్వేల వివరాలను కేటీఆర్ మిగతా 2లో..

## దమ్ముంటే మంత్రి పదవి తెచ్చుకో..

లేకపోతే రాజకీయాలకు రాజీనామా చేయి
కడియం శ్రీహరికి కొండా సురేఖ సవాల్
కడియం శ్రీహరిపై కొండా సురేఖ విమర్శలు
రాజీనామా చేసి గెలవాలని సవాల్
మంత్రి పదవి తెచ్చుకోవాలని వ్యాఖ్య
కాంగ్రెస్‌లో వివాదాలకు కడియమే కారణమని ఆరోపణ
ఎమ్మెల్యే పదవిలో ఇమడలేకపోతున్నారని విమర్శ
నిజాయితీ ఉంటే రాజీనామా చేయాలని డిమాండ్
మహేష్ కుమార్ గౌడ్‌ను కలిసిన సురేఖ
మీనాక్షి నటరాజన్‌కు ఫిర్యాదు చేస్తానన్న మంత్రి
పార్టీలో క్రమశిక్షణపై ఆందోళన
రాజకీయాలు వేడెక్కించిన వ్యాఖ్యలు



**హైదరాబాద్, (డిడి9 వార్త):**
తెలంగాణ కాంగ్రెస్‌లో అంతర్గత విభేదాలు మరోసారి బహిర్గతమయ్యాయి. మంత్రి కొండా సురేఖ, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ఎమ్మెల్యే పదవిలో ఇమడలేకపోతే మంత్రి పదవి తెచ్చుకోవాలని, అది కూడా సాధ్యం కాకపోతే రాజకీయాలకు రాజీనామా చేసి ఇంట్లో కూర్చోవాలని ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యాఖ్యలు కాంగ్రెస్ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారాయి.కడియం శ్రీహరి కాంగ్రెస్ పార్టీలో చేరిన తర్వాతే వివాదాలు ప్రారంభమయ్యాయని కొండా సురేఖ ఆరోపించారు. నాలుగు దశాబ్దాలకు పైగా రాజకీయ అనుభవం ఉన్నందున సాధారణ ఎమ్మెల్యేగా కొనసాగడం ఆయనకు ఇబ్బందిగా మారిందని విమర్శించారు. ఎమ్మెల్యే హోదాలో పనిచేయలేకపోతే దమ్ముంటే మంత్రి పదవి సాధించుకోవాలని, లేకపోతే రాజకీయాలకు మిగతా 2లో..

# పోక్సో కేసులో బండి భగీరథ్‌కు బెయిల్..

**మొదటిపేజీ తరువాయి**

అనంతరం తీర్పును రిజర్వ్ చేసిన న్యాయస్థానం తాజాగా తన నిర్ణయాన్ని వెల్లడించింది. హైకోర్టు రూ.1 లక్ష పూచీకత్తుతో భగీరథ్‌కు బెయిల్ మంజూరు చేసింది. అయితే కేసు విచారణ ప్రక్రియకు ఎలాంటి ఆటంకం కలగకుండా ఉండాలని స్పష్టం చేసింది. కేసులోని సాక్షులను ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రభావితం చేయరాదని, విచారణను ప్రభావితం చేసే చర్యలకు పాల్పడొద్దని న్యాయస్థానం ఆదేశించింది.

దర్యాప్తు అధికారులు పిలిచిన ప్రతిసారి విచారణకు హాజరై పూర్తిగా సహకరించాలని కోర్టు సూచించింది. దర్యాప్తు, విచారణ ప్రక్రియలో ఎలాంటి అంతరాయం కలిగించరాదని స్పష్టం చేసింది. కోర్టు విధించిన షరతులను కచ్చితంగా పాటించాలని, వాటిని ఉల్లంఘిస్తే బెయిల్ రద్దు చేసే అవకాశం ఉంటుందని పేర్కొంది.

ఈ కేసు మే నెలలో హైదరాబాద్‌లోని పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో నమోదైంది. ఓ మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డారనే ఆరోపణలతో భగీరథ్‌పై పోక్సో చట్టం, భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్)లోని సంబంధిత సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. బాధితురాలి వాంగ్మూలం అనంతరం పోలీసులు మరింత తీవ్రమైన పోక్సో సెక్షన్లను కూడా చేర్చారు.

ఈ కేసులో ముందుగా ముందస్తు బెయిల్ కోరిన భగీరథ్‌కు హైకోర్టు మధ్యంతర రక్షణ నిరాకరించింది. అనంతరం ఆయన లొంగిపోవడంతో న్యాయస్థానం రిమాండ్‌కు పంపింది. దర్యాప్తు పూర్తయిన తర్వాత రెగ్యులర్ బెయిల్ కోసం ఆయన దాఖలు చేసిన పిటిషన్‌పై ఇటీవల వాదనలు ముగిశాయి. దర్యాప్తు పూర్తయిందని, భగీరథ్ ఇప్పటికే 40 రోజులకు పైగా జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నారని ఆయన తరపు న్యాయవాదులు కోర్టుకు విన్నవించారు.

వాదనలు పరిశీలించిన తెలంగాణ హైకోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. అయితే కేసు విచారణ ఇంకా కొనసాగుతుండటంతో సాక్ష్యాధారాలపై ఎలాంటి ప్రభావం చూపరాదని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. కేసు తదుపరి విచారణ సంబంధిత కోర్టులో కొనసాగనుంది.

# కాళేశ్వరం అవినీతికి హరీశ్ రావే కారణం

**మొదటిపేజీ తరువాయి**

అడ్డగాడిదల్లా తన కాళ్లల్లో కట్టెలు పెట్టే ప్రయత్నాలు ఎందుకు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏనాటికైనా తాను మళ్లీ బీఆర్ఎస్ పార్టీలోకి వస్తానంటూ ఆ పార్టీ నేతలు ప్రచారం చేస్తున్నారని, కానీ తన కంఠంలో ప్రాణమున్నంత వరకు మళ్లీ బీఆర్ఎస్‌లో కలిసే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు.

తమ నూతన పార్టీకి 'తెలంగాణ రక్షణ సేన' అనే పేరును తాము సొంతంగా పెట్టుకోలేదని, కేంద్ర ఎన్నికల సంఘం తమకు పంపిన ఐదు పేర్ల జాబితా నుండి మాత్రమే దీనిని ఎంపిక చేసుకున్నామని కవిత స్పష్టం చేశారు. అయితే ఈ పేరును కూడా తమకు దక్కకుండా చేసేందుకు బీఆర్ఎస్ నాయకత్వం అన్ని రకాలుగా కుట్రలు చేస్తోందని ధ్వజమెత్తారు. కానీ దేవుడు, ధర్మం, న్యాయం తన పక్షాన ఉన్నాయని, అంతిమంగా ఈ పోరాటంలో విజయం తనదే అవుతుందని ఆమె ధీమా వ్యక్తం చేశారు. పార్టీ పేరు ఏదైనా సరే, చివరకు ప్రజల ఆశీర్వాదం ఉంటేనే ఏ పార్టీ అయినా మనుగడ సాగిస్తుందని గుర్తుచేశారు. తాను గతంలో కేటీఆర్, హరీశ్ రావులపై చేసిన రాజకీయ విమర్శలకు సమాధానం చెప్పలేకనే ఇలాంటి చిల్లర పనులు చేస్తున్నారని విమర్శించారు.

బీఆర్ఎస్ పార్టీకి చెందిన అధికారిక సోషల్ మీడియా విభాగంపై కవిత తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కనీసం ఒక మహిళ అని చూడకుండా, తల్లీ, చెల్లి అనే కనీస సంస్కారం, మర్యాద లేకుండా సోషల్ మీడియాలో అడ్డగోలుగా, అసభ్యకరంగా కామెంట్లు పెడితే చూస్తూ ఊరుకునేది లేదని తీవ్రంగా హెచ్చరించారు. దమ్ముంటే తెర వెనుక దాక్కోకుండా ముఖం చూపించి నేరుగా మాట్లాడాలని సవాల్ విసిరారు. బీఆర్ఎస్ సోషల్ మీడియా అకౌంట్ల వెనుక ఉండి నడిపిస్తున్నది ఎవరో తమకు పూర్తిగా తెలుసని, పరిమితులు దాటి అతిగా ప్రవర్తిస్తే కాళ్లు విరగ్గొడతామని కఠినమైన భాషలో వార్నింగ్ ఇచ్చారు.

రాజకీయంగా తమకు అనుకూల ప్రచారం చేసుకోవడం కోసం, తమ తప్పులను కప్పిపుచ్చుకోవడం కోసం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇటీవలే సుమారు రూ.188 కోట్ల భారీ వ్యయంతో ఒక ప్రముఖ ఇంగ్లీష్ దినపత్రికను కొనుగోలు చేశారని కవిత సంచలన ఆరోపణ చేశారు. మీడియా సంస్థలను కొనుగోలు చేసినంత మాత్రాన నిజాలు నమ్మకుండా పోవన్నారు. ప్రజలు మెచ్చితే రేపు తాము అధికారంలోకి వస్తామని, ఒకవేళ ప్రతిపక్షంలో కూర్చోబెట్టినా అధికారం లేదనే నెపంతో తాము ఇంట్లో పడుకోబోమని, నిరంతరం జనం మధ్యే ఉంటూ ప్రజా సమస్యలపై పోరాడుతామని స్పష్టం చేశారు.

తెలంగాణ రక్షించేందుకు జోడెద్దుల్లా పని చేయాల్సిన కేటీఆర్, హరీశ్ రావులు దున్నపోతుల్లా మారి ప్రజల సమస్యలను పూర్తిగా గాలికొదిలేశారని కవిత ఘాటుగా విమర్శించారు. కేవలం అవినీతిపరులను కాపాడటమే వారు నిత్యకృత్యంగా పెట్టుకున్నారని ఆరోపించారు. తాను మొన్న ఉద్యమకారుల హక్కుల కోసం పోరాటం చేస్తే, తనను అడ్డుకోవడానికి అటు కాంగ్రెస్, ఇటు బీఆర్ఎస్ పార్టీలు కలిసి ఒక ఉమ్మడి నాటకానికి తెరలేపాయని విమర్శించారు. అవసరాన్ని బట్టి కాంగ్రెస్‌తో, వీలైతే బీజేపీతో జతకట్టే బీఆర్ఎస్‌కు అసలు ఒక రాజకీయ విధానం అంటూ ఉందా అని నిలదీశారు. కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన భారీ అవినీతికి హరీశ్ రావే పూర్తి బాధ్యుడని, కేసీఆర్‌కు అవినీతి మరకలు అంటించింది చాలదన్నట్లు ఇప్పుడు మళ్లీ మరో మూడు నెలలు ఇరిగేషన్ మంత్రి పదవి అడుగుతున్నావా అని ప్రశ్నించారు. ఏనాడైతే అవినీతికి కారణమైన గుంటనక్కలను ముందు పెట్టారో, నాడే బీఆర్ఎస్ పతనం మొదలైందని, ఆ పార్టీ ఈ జన్మలో బాగుపడదని జోస్యం చెప్పారు.

తెలంగాణ ప్రజల ఆస్తి అయిన దాదాపు రూ.800 కోట్ల విలువైన ప్రభుత్వ భూములను 'ఫీనిక్స్' అనే ఒక ప్రైవేట్ రియల్ ఎస్టేట్ సంస్థకు కేటీఆర్, హరీశ్ రావు కలిసి దారాదత్తం చేశారని కవిత ఆరోపించారు. అసలు ఎవడా ఫీనిక్స్ గాడు? వాడు తెలంగాణ వాడా.. ఆంధ్ర వాడా? అని ప్రశ్నించిన ఆమె, ఎందుకంత ప్రేమతో తెలంగాణ విలువైన భూములను అతనికి రాసిచ్చారని నిలదీశారు. జాతీయ పార్టీలకు తెలంగాణ భూములను కాపాడాలనే ఆలోచన ఎందుకు ఉంటుందని ప్రశ్నించారు. హైదరాబాద్ నగరం నడిబొడ్డున ఉన్న సుమారు 33 లక్షల టన్నుల విలువైన కలపను సదరు ఫీనిక్స్ సంస్థ అక్రమంగా కొట్టేస్తే, గత ప్రభుత్వం కేవలం 10 చిన్న కేసులు పెట్టి ఊరుకుందని విమర్శించారు. తాము భవిష్యత్తులో అధికారంలోకి వచ్చాక కేసీఆర్, ప్రస్తుత రేవంత్ రెడ్డి ప్రభుత్వాలు ప్రైవేట్ సంస్థలకు ఇచ్చిన ధార్మిక, ప్రభుత్వ భూములన్నింటిపై సమగ్ర రివ్యూ జరిపి, ప్రజా ధనాన్ని కక్కిస్తామని స్పష్టం చేశారు.

తమ పార్టీ భవిష్యత్ కార్యాచరణలో భాగంగా 'సింగరేణి బాయి బాట' కార్యక్రమాన్ని చేపట్టి కార్మికులతో స్వయంగా మమేకమవుతున్నట్లు కవిత ప్రకటించారు. సింగరేణిలోని పర్మినెంట్ మరియు కాంట్రాక్ట్ కార్మికులు ఎదుర్కొంటున్న అనేక తీవ్రమైన సమస్యలపై యాజమాన్యం తక్షణమే స్పందించి పరిష్కరించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ హక్కుగా ఉన్న బొగ్గు బ్లాకులను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తన మొండి వైఖరితో ప్రైవేట్ పరం చేస్తోందని ధ్వజమెత్తారు. రాష్ట్ర ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యం కలిసి కార్మికుల డిపెండెంట్ ఉద్యోగాలపై త్వరలోనే స్పష్టమైన ప్రకటన చేయకపోతే, ఈ నెల 20వ తేదీ నుండి రామగుండం కేంద్రంగా తాను నిరవధిక నిరాహార దీక్షకు దిగడం ఖాయమని కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు.




# పరిశ్రమలు మొత్తం ఓఆర్ఆర్ బయటకు

**మొదటిపేజీ తరువాయి**

అభివృద్ధి ప్రణాళికలను వివరించారు.

హైదరాబాద్ కోర్ అర్బన్ ప్రాంతంలో ప్రస్తుతం సుమారు 1.35 కోట్ల మంది నివసిస్తున్నారని, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా నగరాన్ని అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని సీఎం పేర్కొన్నారు. ఢిల్లీ, ముంబై, బెంగళూరు, చెన్నై వంటి మెట్రో నగరాలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిశీలించి, అలాంటి పరిస్థితులు హైదరాబాద్‌కు రాకుండా ఇప్పుడే ముందస్తు చర్యలు చేపడుతున్నామని చెప్పారు. జీడిమెట్ల, బాలానగర్ వంటి పారిశ్రామిక ప్రాంతాల నుంచి వెలువడుతున్న కాలుష్యం, మూసీ నది కాలుష్యం నగర ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని సీఎం ఆందోళన వ్యక్తం చేశారు. అందుకే ఓఆర్ఆర్ లోపల ప్రాంతాన్ని పూర్తిగా కాలుష్య రహితంగా మార్చే కార్యాచరణను ప్రభుత్వం రూపొందించిందని తెలిపారు.

పరిశ్రమలను ఓఆర్ఆర్ వెలుపలికి తరలించేందుకు ఇప్పటికే చట్టం తీసుకొచ్చామని, పెరి అర్బన్ ఎకానమీ ప్రాంతాన్ని ప్రత్యేక మాన్యుఫాక్చరింగ్ జోన్‌గా అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. నగరం నుంచి తరలించే పరిశ్రమలకు అవసరమైన భూమి, మౌలిక సదుపాయాలను ప్రభుత్వం అందిస్తుందని స్పష్టం చేశారు.

ఈ మాన్యుఫాక్చరింగ్ జోన్‌లో తొలి పరిశ్రమగా ప్రీమియర్ ఎనర్జీస్ యూనిట్ ప్రారంభం కావడం శుభపరిణామమని సీఎం అన్నారు. కేవలం 12 నెలల్లోనే అత్యాధునిక సోలార్ తయారీ యూనిట్‌ను నిర్మించడం సంస్థ సామర్థ్యానికి నిదర్శనమని కొనియాడారు.

ఈ సందర్భంగా ప్రీమియర్ ఎనర్జీస్ రూపొందించిన సోలార్ ఆధారిత 'ఆక్సీ ట్రీ'ని ముఖ్యమంత్రి ప్రారంభించారు. సోలార్ విద్యుత్‌తో పనిచేసే ఈ వ్యవస్థ వీధి దీపాలతో పాటు గాలిని శుద్ధి చేసే సాంకేతికతను కలిగి ఉందని తెలిపారు. సంస్థ తయారు చేస్తున్న సోలార్ మాడ్యూల్స్‌తో పాటు ఇతర ఉత్పత్తులను కూడా ఆయన పరిశీలించారు. తెలంగాణ రైజింగ్-2047 విజన్‌తో రాష్ట్రాన్ని క్యూర్ (CURE), ప్యూర్ (PURE), రేర్ (RARE) అనే మూడు ప్రాంతీయ అభివృద్ధి మండళ్లుగా విభజించి సమగ్ర అభివృద్ధి చేపడుతున్నామని ముఖ్యమంత్రి వెల్లడించారు. 2034 నాటికి తెలంగాణను ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.




యువతకు ఉపాధి అవకాశాలు పెంచేందుకు నైపుణ్యాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని సీఎం తెలిపారు. పరిశ్రమలకు అవసరమైన బ్లూ కాలర్ ఉద్యోగాలకు యువతను సిద్ధం చేసేందుకు అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ సెంటర్లు, పాలిటెక్నిక్ కళాశాలల బలోపేతం, స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటు వంటి కార్యక్రమాలను అమలు చేస్తున్నట్లు చెప్పారు. హైదరాబాద్ ప్రపంచస్థాయి నగరంగా ఎదగాలంటే మరిన్ని పెట్టుబడులు, పరిశ్రమలు అవసరమని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ప్రకృతిని పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, కాలుష్య నియంత్రణలో ప్రభుత్వంతో పాటు ప్రజల సహకారం కూడా ఎంతో అవసరమని ఆయన పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, ఎమ్మెల్యే కాలే యాదయ్య, ప్రీమియర్ ఎనర్జీస్ చైర్మన్ సురేందర్ పాల్ సింగ్ సలూజా, మేనేజింగ్ డైరెక్టర్ చిరంజీవ్ సింగ్ సలూజా, డైరెక్టర్ సుధీర్ మూల, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రేవతి రోహిణి, ప్రభుత్వ ఉన్నతాధికారులు, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు. అవసరమైతే ఇదే కథనాన్ని మరింత "ఫస్ట్ లీడ్" శైలిలో లేదా "వెబ్ SEO" శైలిలో కూడా మార్చి ఇవ్వగలను.

# మూసీ పునరుజ్జీవానికి రూ.7,345 కోట్లకు గ్రీన్ సిగ్నల్

**మొదటిపేజీ తరువాయి**

ప్రాజెక్టు అమలు ప్రక్రియ మరింత వేగం పుంజుకోనుంది.

ఈ ప్రాజెక్టును మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎంఆర్‌డీసీఎల్) ఆధ్వర్యంలో అమలు చేయనున్నారు. మొత్తం ప్రాజెక్టు వ్యయంలో రూ.4,500 కోట్లను ఆసియా అభివృద్ధి బ్యాంకు (ఏడీబీ) రుణంగా సమకూర్చుకోనున్నారు. మిగిలిన రూ.2,845 కోట్లను హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్ఎండీఏ) లేదా తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (టీజీఐఐసీ) ద్వారా రుణంగా సమీకరించేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది.

ప్రాజెక్టు తొలి దశను రెండు జోన్లుగా విభజించి అభివృద్ధి చేయనున్నారు. జోన్ 1ఏ పరిధిలో హిమాయత్‌సాగర్ నుంచి బాపూఘాట్ వరకు 9.20 కిలోమీటర్ల మేర అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. ఇందుకోసం రూ.3,104 కోట్లను ప్రభుత్వం కేటాయించింది. ఈ ప్రాంతంలో నది పరిరక్షణతో పాటు ఆధునిక మౌలిక వసతుల కల్పన, పర్యావరణ పరిరక్షణ, నది తీరాల అభివృద్ధి వంటి పనులు చేపట్టనున్నారు. జోన్ 1బీ పరిధిలో ఉస్మాన్‌సాగర్ నుంచి బాపూఘాట్ వరకు 11.80 కిలోమీటర్ల మేర అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. ఈ పనులకు రూ.3,950 కోట్లను ప్రభుత్వం ఆమోదించింది. రెండు జోన్లను కలిపి మొత్తం 21 కిలోమీటర్ల మేర మూసీ నది పరివాహక ప్రాంతాన్ని ఆధునికంగా తీర్చిదిద్దనున్నారు.

ప్రాజెక్టు అమలు కోసం ప్రాజెక్టు మేనేజ్‌మెంట్ కన్సల్టెన్సీ (పీఎంసీ)ని నియమించేందుకు కూడా ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఇందుకు సంబంధించిన చర్యలను మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చేపట్టనుంది. ప్రాజెక్టు పనులను నాణ్యతతో, నిర్ణీత గడువులో పూర్తి చేయడంలో కన్సల్టెన్సీ కీలక పాత్ర పోషించనుంది. మూసీ నది పునరుజ్జీవం, నది తీరాల అభివృద్ధి, కాలుష్య నియంత్రణ, ఆధునిక మౌలిక సదుపాయాల కల్పన లక్ష్యంగా ప్రభుత్వం ఈ ప్రాజెక్టును చేపడుతోంది. తొలి దశకు భారీగా నిధులు విడుదల చేస్తూ ప్రభుత్వం అనుమతి ఇవ్వడంతో మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టు అమలుకు మార్గం సుగమమైంది.

# నేడు విద్యాసంస్థల బంద్‌కు వామపక్ష విద్యార్థి సంఘాల పిలుపు

- **పాఠశాలల సంఖ్య తగ్గించొద్దని డిమాండ్**
- **విద్యాశాఖకు మంత్రి నియమించాలని విజ్ఞప్తి**
- **ఖాళీ పోస్టులు భర్తీ చేయాలన్న డిమాండ్**
- **ప్రైవేటు ఫీజుల నియంత్రణకు చట్టం కోరుతూ**
- **ఇంటర్‌లో మధ్యాహ్న భోజనం అమలు చేయాలి**
- **గురుకులాలకు సొంత భవనాల నిర్మాణం**
- **పేదలకు 25 శాతం ఉచిత ప్రవేశాలు**
- **ఎన్ఈపీపై అసెంబ్లీలో తీర్మానం కోరుతూ**
- **పుస్తకాల దోపిడీని అరికట్టాలని డిమాండ్**

**హైదరాబాద్, (డిడి9 వార్త):**

విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం వామపక్ష విద్యార్థి సంఘాలు శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా విద్యాసంస్థల బంద్‌కు పిలుపునిచ్చాయి. ప్రభుత్వ పాఠశాలల సంఖ్యను తగ్గించే ప్రయత్నాలను విరమించుకోవాలని, విద్యాశాఖకు వెంటనే పూర్తి స్థాయి మంత్రిని నియమించాలని, విద్యారంగంలో పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ బంద్ నిర్వహిస్తున్నట్లు ప్రకటించాయి. ప్రస్తుతం రాష్ట్రంలో సుమారు 27 వేల ప్రభుత్వ పాఠశాలలు ఉండగా, వాటి సంఖ్యను నాలుగు వేలకు తగ్గించాలని ప్రభుత్వం యోచిస్తోందని విద్యార్థి సంఘాలు ఆరోపించాయి. ఈ నిర్ణయం అమలైతే ప్రభుత్వ విద్యా వ్యవస్థ తీవ్రంగా దెబ్బతింటుందని, గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు ఎక్కువగా నష్టపోతారని ఆందోళన వ్యక్తం చేశాయి. పాఠశాలలను మూసివేయకుండా వాటిని మరింత బలోపేతం చేయాలని ప్రభుత్వాన్ని కోరాయి.

ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజుల భారం రోజురోజుకూ పెరుగుతోందని, దీనిపై నియంత్రణ తీసుకొచ్చేలా ప్రత్యేక చట్టం రూపొందించాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి. తల్లిదండ్రులపై పడుతున్న ఆర్థిక భారాన్ని తగ్గించేలా ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని కోరాయి.

రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయులు, మండల విద్యాధికారులు (ఎంఈవోలు), జిల్లా విద్యాధికారులు (డీఈవోలు), లెక్చరర్ల పోస్టులను అత్యవసరంగా భర్తీ చేయాలని డిమాండ్ చేశాయి. అలాగే అద్దె భవనాల్లో కొనసాగుతున్న ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్లు, గురుకులాలకు శాశ్వత భవనాలు నిర్మించాలని విజ్ఞప్తి చేశాయి. ఇంటర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని తక్షణమే అమలు చేయాలని, విద్యాహక్కు చట్టాన్ని పూర్తి స్థాయిలో అమలు చేసి అన్ని విద్యాసంస్థల్లో పేద విద్యార్థులకు 25 శాతం ఉచిత ప్రవేశాలు కల్పించాలని వామపక్ష విద్యార్థి సంఘాలు కోరాయి.

జాతీయ విద్యా విధానం (ఎన్ఈపీ) అమలు చేయబోమని రాష్ట్ర అసెంబ్లీలో తీర్మానం చేయాలని కూడా విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి. ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల్లో విద్యార్థులపై అదనపు భారం మోపేలా పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్స్‌ను బలవంతంగా విక్రయించే విధానాన్ని అరికట్టాలని ప్రభుత్వాన్ని కోరాయి. విద్యారంగానికి సంబంధించిన ఈ సమస్యలన్నింటినీ ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా విద్యాసంస్థల బంద్ పాటించాలని వామపక్ష విద్యార్థి సంఘాలు పిలుపునిచ్చాయి. విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు బంద్‌కు సహకరించి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని ఆయా సంఘాల నాయకులు విజ్ఞప్తి చేశారు.

# హరీశ్ రావుపై కేసీఆర్ కే నమ్మకం లేదు

**మొదటిపేజీ తరువాయి**

పనులపై హరీశ్‌రావు ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శిస్తున్న నేపథ్యంలో మంత్రి ఉత్తమ్ ప్రతిస్పందించారు. హరీశ్‌రావు విమర్శలకు సరైన సమయంలో పూర్తి వివరాలతో సమాధానం ఇస్తామని స్పష్టం చేశారు.

కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల మరమ్మతులపై ప్రభుత్వం వేగంగా చర్యలు తీసుకుంటోందని ఉత్తమ్ తెలిపారు. వచ్చే వేసవి నాటికి ఈ మూడు బ్యారేజీల్లో జరుగుతున్న మరమ్మతు పనులు పూర్తవుతాయని వెల్లడించారు. ప్రభుత్వం చిత్తశుద్ధితో పనులు చేస్తోందని, రాజకీయ విమర్శల కోసం పనులను అడ్డుకోవడం సరికాదని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ బ్యారేజీలో పిల్లర్లు కుంగిపోవడంతో ఈ ప్రాజెక్టు రాష్ట్ర రాజకీయాల్లో ప్రధాన చర్చగా మారింది. అనంతరం నిపుణుల కమిటీలు చేసిన పరిశీలనల్లో మేడిగడ్డతో పాటు అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లో కూడా మరమ్మతులు అవసరమని సూచించాయి. ప్రస్తుతం ప్రభుత్వం ఈ మూడు బ్యారేజీల పునరుద్ధరణ పనులను చేపట్టింది.

హరీశ్‌రావు తనకు మంత్రి పదవి ఇవ్వాలని వ్యాఖ్యానిస్తున్నారని ఉత్తమ్ విమర్శించారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే జగ్గారెడ్డి చెప్పినట్లుగా హరీశ్‌రావు కాంగ్రెస్ పార్టీలో చేరబోతున్నారా? అని ప్రశ్నించారు. ఈ వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో కొత్త చర్చకు దారితీశాయి. హరీశ్‌రావు చేస్తున్న ఆరోపణలపై ప్రస్తుతం అన్ని విషయాలు చెప్పబోమని, సరైన సమయంలో పూర్తి వివరాలతో ప్రజల ముందుకు వస్తామని ఉత్తమ్ తెలిపారు. ప్రభుత్వం చేపడుతున్న పనులే తమ సమాధానమని పేర్కొన్నారు. ఇరిగేషన్ అంశంపై కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య మాటల యుద్ధం రోజురోజుకూ తీవ్రతరమవుతోంది. ముఖ్యంగా కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం, బ్యారేజీల నాణ్యత, మరమ్మతులు, సాగునీటి నిర్వహణ వంటి అంశాలపై ఇరు పార్టీల మధ్య ఆరోపణలు, ప్రత్యారోపణలు కొనసాగుతున్నాయి. తాజా వ్యాఖ్యలతో ఉత్తమ్ కుమార్ రెడ్డి, హరీశ్‌రావు మధ్య రాజకీయ విమర్శలు మరోసారి చర్చనీయాంశంగా మారాయి.

# దమ్ముంటే మంత్రి పదవి తెచ్చుకో..

**మొదటిపేజీ తరువాయి**



స్వస్తి చెప్పాలని సూచించారు.

కడియం శ్రీహరికి తనపై, తన రాజకీయ బలంపై నిజంగా నమ్మకం ఉంటే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి మళ్లీ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి గెలిచి చూపించాలని మంత్రి సవాల్ విసిరారు. ప్రజల తీర్పుతో తిరిగి గెలిస్తేనే ఆయనకు ప్రజాభిమానం ఉందని నిరూపితమవుతుందని అన్నారు.

పార్టీలో నెలకొన్న పరిణామాలపై ఇప్పటికే తెలంగాణ కాంగ్రెస్ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌ను కలిసి ఫిర్యాదు చేసినట్లు కొండా సురేఖ వెల్లడించారు. అలాగే ఈ నెల 14న కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌ను కూడా కలిసి కడియం శ్రీహరి వ్యవహారంపై ఫిర్యాదు చేస్తానని చెప్పారు.

కాంగ్రెస్ పార్టీ క్రమశిక్షణకు విరుద్ధంగా ఎవరూ వ్యవహరించకూడదని, పార్టీ ప్రతిష్ఠను దెబ్బతీసే చర్యలను సహించబోమని కొండా సురేఖ స్పష్టం చేశారు. ఆమె చేసిన తాజా వ్యాఖ్యలు రాష్ట్ర కాంగ్రెస్‌లో అంతర్గత విభేదాలను మరోసారి తెరపైకి తీసుకురాగా, ఈ వ్యవహారం ఎలాంటి మలుపు తిరుగుతుందన్నదానిపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.

# కాంగ్రెస్ పని అయిపోయింది..

**మొదటిపేజీ తరువాయి**



ప్రస్తావించారు. ఆ వివరాలు ప్రకారం.. ముఖ్యమంత్రి చేయించుకున్న సొంత సర్వే ప్రకారం.. రాష్ట్రంలో ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే భారత రాష్ట్ర సమితి సుమారు 78 సీట్లను కైవసం చేసుకుని అత్యంత సులభంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని తేలిందన్నారు. కేవలం సీఎం సొంత సర్వేలోనే కాకుండా.. రెండు ప్రముఖ మీడియా సంస్థలతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఇంటెలిజెన్స్ విభాగాలు క్షేత్ర స్థాయిలో చేసిన ప్రజాభిప్రాయ సేకరణలోనూ ఇదే పచ్చి నిజం వ్యక్తమైందని కేటీఆర్ స్పష్టం చేశారు. రాష్ట్రంలో పాలన కుంటుపడిందని, మరోసారి ప్రజలంతా కేసీఆర్ గారిని ముఖ్యమంత్రిగా చూడాలని బలంగా కోరుకుంటున్నారని అన్ని సర్వే నివేదికలు తేల్చిచెప్పాయని కేటీఆర్ వివరించారు.

**సర్వేల భయంతోనే సీఎం అడ్డగోలు మాటలు**

సగం పరిపాలనా కాలం ముగిసేసరికే ప్రజలు కాంగ్రెస్ పార్టీపై తీవ్రమైన ఆగ్రహంతో ఉన్నారని కేటీఆర్ విమర్శించారు. సొంత సర్వేతో పాటు మిగతా అన్ని నివేదికల్లోనూ వ్యక్తమైన ఈ ఊహించని ప్రజా వ్యతిరేకతను చూసి తట్టుకోలేకనే.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గత వారం రోజులుగా తీవ్ర నిరాశతో, అడ్డగోలుగా మాట్లాడుతున్నారని కేటీఆర్ ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పతనాన్ని ఆపడం ఎవరి వల్లా కాదని ఆయన జోస్యం చెప్పారు.

# పోలీస్ విధుల్లో నైపుణ్యమే లక్ష్యం

- - నిజామాబాద్‌లో అట్టహాసంగా 'జోన్ 2 బాసర లెవల్ పోలీస్ డ్యూటీ మీట్'

**నిజామాబాద్ జిల్లా జులై 09(డీడీ9 వార్త):**




విధి నిర్వహణలో సామర్థ్యాన్ని పెంపొందించుకోవడంతో పాటు నేర పరిశోధనలో అత్యాధునిక పద్ధతులను అవలంబించేలా పోలీసు సిబ్బందిని సన్నద్ధం చేసేందుకు నిజామాబాద్‌లో 'జోన్ 2 బాసర లెవల్ పోలీస్ డ్యూటీ మీట్ 2026' ఘనంగా ప్రారంభమైంది. నిజామాబాద్, జగిత్యాల్, నిర్మల్ మరియు ఆదిలాబాద్ జిల్లాల పరిధిలోని పోలీసు సిబ్బంది కోసం నిర్వహిస్తున్న ఈ పోటీలను నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య ప్రారంభించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ... మారుతున్న కాలానికి అనుగుణంగా చట్టాలను సైన్స్ అండ్ టెక్నాలజీతో అనుసంధానించుకుని నేర పరిశోధనలో ఉత్తమ ప్రతిభ కనబరచడమే ఈ డ్యూటీ మీట్ ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. కానిస్టేబుల్ స్థాయి నుండి సి.ఐ స్థాయి వరకు సిబ్బందిలో పని పద్ధతులు మెరుగుపడాలని, పోటీతత్వం ద్వారా పరిశోధనా సామర్థ్యం వృద్ధి చెందుతుందని ఆయన ఆకాంక్షించారు. నేర స్థలాల వద్ద ఆధారాలను సేకరించే 'పోలీస్ క్లూస్' సేకరణ ప్రక్రియపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. నిజామాబాద్‌లోని పోలీస్ హెడ్ క్వార్టర్ గ్రౌండ్, పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్ మరియు పోలీస్ కార్యాలయం ప్రాంగణాల్లో రెండు రోజుల పాటు ఈ ఎంపిక పరీక్షలు



జరుగుతాయి. ఇందులో సైంటిఫిక్ ఎయిడ్స్ టు ఇన్వెస్టిగేషన్, కంప్యూటర్స్, డాగ్ స్క్వాడ్, ప్రొఫెషనల్ ఫోటోగ్రఫీ, ఎక్స్‌ప్లోజివ్స్, నార్కోటిక్స్, ఫింగర్ ప్రింట్స్ మరియు ఫోరెన్సిక్ మెడిసిన్ వంటి వివిధ విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వారు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని కమిషనర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ (అడ్మిన్) ఎన్.శుభం ప్రకాష్, ఏసీపీలు ప్రకాష్ యాదవ్ (నిజామాబాద్), రాజశేఖర్ (సీటీసీ), శ్రీశైలం (సీసీఎస్), గురు నాయుడు (సీసీఆర్బీ), నరేందర్ (టాస్క్ ఫోర్స్), అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ నాగేంద్రబాబుతో పాటు నాలుగు జిల్లాలకు చెందిన సీఐలు, ఎస్ఐలు మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## పిల్లల్లో పోషకాహార లోపం నివారణే లక్ష్యం..

- త్వరలో అల్బెండజోల్ పంపిణీ

**నిజామాబాద్ జిల్లా జులై 09(డీడీ9 వార్త):**

జిల్లావ్యాప్తంగా జులై 13న జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. ఈ కార్యక్రమం ద్వారా 1 నుంచి 19 ఏళ్లలోపు పిల్లలందరికీ అల్బెండజోల్ మాత్రలను అందజేయనున్నట్లు ముదక్‌పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ అజ్మల్ తెలిపారు. మోపాల్ మండలం బోర్గావ్ జడ్పీహెచ్ఎస్‌లో దీనికి సంబంధించిన మండల స్థాయి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు, కేజీబీవీలు, మోడల్ పాఠశాలలతో పాటు అన్ని రకాల హాస్టళ్లు, మతపరమైన విద్యాసంస్థల్లోనూ ఈ మాత్రల పంపిణీని తప్పనిసరి చేశామన్నారు. నులిపురుగుల నివారణ వల్ల పిల్లల్లో రక్తహీనత తగ్గి, పోషకాహార లోపం నివారణకు దోహదపడుతుందని వివరించారు. మాత్రల విషయంలో ఎలాంటి అపోహలు పెట్టుకోవద్దని తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు సూచించారు. ఆరోగ్య విద్య బోధకులు ఘన్‌పూర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. నులిపురుగుల వ్యాప్తి, లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. చేతుల శుభ్రతపై పిల్లలకు ప్రత్యేకంగా వివరించాలని ఉపాధ్యాయులను కోరారు. ఒకవేళ జులై 13న మాత్రలు వేసుకోని పిల్లలకు, జులై 20న 'మలివిడుత' రోజున తప్పనిసరిగా పంపిణీ చేయాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ సాయిలు, ప్రధానోపాధ్యాయులు శంకర్, ఎంఎల్‌హెచ్‌పీ డాక్టర్ సంతోష్, సీహెచ్ఓ భూలక్ష్మి, డీహెచ్ఈ ఘన్‌పూర్ వెంకటేశ్వర్లు, అనురాధ, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.




## జిల్లాలో కొత్త హెచ్ఐవీ కేసుల గుర్తింపుపై ప్రత్యేక దృష్టి

- లక్ష్యాలను పూర్తి చేయాలని డీఎంహెచ్ఓ ఆదేశం

**నిజామాబాద్ జిల్లా జులై 09(డీడీ9 వార్త):**

జిల్లాలో హెచ్ఐవీ సోకిన వారిని సకాలంలో గుర్తించి, వారికి తక్షణమే చికిత్స అందించేలా వైద్య ఆరోగ్యశాఖ కార్యాచరణ సిద్ధం చేస్తోంది. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో జిల్లా ఎయిడ్స్ కంట్రోల్ విభాగం ఆధ్వర్యంలో 'మొబిలైజేషన్ ఎయిడ్స్ సురక్ష' కార్యక్రమంపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా వైద్యాధికారి డాక్టర్ రాజశ్రీ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జాతీయ ఎయిడ్స్ నివారణ సంస్థ నిర్దేశించిన లక్ష్యాల గురించి వివరించారు. 2026 డిసెంబర్ 1 నాటికి నిజామాబాద్ జిల్లాలో 0.32 శాతం ప్రివలెన్స్ ప్రాతిపదికన సుమారు 5,874 మంది హెచ్ఐవీ బాధితులు ఉంటారని అంచనా వేసినట్లు తెలిపారు. ఇందులో 95 శాతం మందికి తమ హెచ్ఐవీ స్థితి తెలిసి ఉండాలని లక్ష్యం కాగా, ప్రస్తుతం జిల్లాలో 93 శాతం మందిని గుర్తించామని వెల్లడించారు. మిగిలిన వారిని కూడా త్వరగా గుర్తించి వారిని చికిత్సలో చేర్పించేందుకు సిబ్బంది వేగంగా పని చేయాలని ఆమె ఆదేశించారు. ఈ లక్ష్యాన్ని చేరుకోవడానికి అవగాహన సదస్సులు, ఆరోగ్య శిబిరాల నిర్వహణతో పాటు హైరిస్క్ గ్రూపులను గుర్తించడంలో సిబ్బంది టీమ్ వర్క్‌తో పనిచేయాలని సూచించారు. క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా ఉండి లక్ష్యాలను పూర్తి చేయాలని సిబ్బందిని కోరారు. ఈ సమీక్షా సమావేశంలో జిల్లా టీబీ నియంత్రణ అధికారి డాక్టర్ దేవి నాగేశ్వరి, మెడికల్ ఆఫీసర్ శ్రీనివాస్ గౌడ్, డీపీఎం సుధాకర్, సీఎస్ఓ నవీన్, సీపీఓ మొహిజ్ అహ్మద్, జిల్లా ఎయిడ్స్ మరియు టీబీ నియంత్రణ విభాగాల సిబ్బంది, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.




## నిజాం షుగర్స్ పునరుద్ధరణే లక్ష్యం

- ఉద్యమనేత రాఘవులుకు ఘన నివాళి

**బోధన్, నిజామాబాద్ జిల్లా జులై 09(డీడీ9 వార్త):**



నిజాం షుగర్ ఫ్యాక్టరీని ప్రభుత్వ రంగంలోనే పునరుద్ధరించాలని, మూతపడిన పరిశ్రమను తెరిపించాలని బోధన్ కేంద్రంగా పోరాడిన యోధుడు, నిజాం షుగర్స్ రక్షణ కమిటీ కన్వీనర్ ఉప్పునూతల రాఘవులు అనితరసాధ్యులని వక్తలు కొనియాడారు. బోధన్‌లోని పీఆర్‌టీయూ భవన్ వద్ద గురువారం రాఘవులు 8వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి మానవ హక్కుల వేదిక జిల్లా అధ్యక్షులు గడ్డం గంగులు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పలువురు వామపక్ష, ఎన్డీఎస్ఎల్ కార్మిక సంఘాల నాయకులు మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఫ్యాక్టరీ విషయంలో కాలయాపన చేసి ప్రజలను మోసం చేసిందని, నేడు కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే బాటలో నడుస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాఘవులు ప్రాణాలకు తెగించి కేసులు, నిర్బంధాలను ఎదుర్కొని ఉద్యమించారని గుర్తు చేశారు. ఫ్యాక్టరీ మూతపడటంతో కార్మికులు రోడ్డున పడ్డారని, వేతనాలు లేక దుర్భర జీవితం గడుపుతున్నారని నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. బోధన్ ప్రాంతంలో యువతకు ఉపాధి కల్పించే పరిశ్రమలు లేకపోవడం, ప్రజాప్రతినిధులు పరిశ్రమల ఏర్పాటుకు చొరవ చూపకపోవడం దురదృష్టకరమని విమర్శించారు. ప్రభుత్వం కమిటీల పేరుతో కాలయాపన చేయకుండా తక్షణమే పెండింగ్‌లో ఉన్న కార్మికుల వేతన బకాయిలు చెల్లించాలని, ఫ్యాక్టరీని ప్రభుత్వ రంగంలోనే నడపాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో వామపక్ష పార్టీల నేతలు శంకర్ గౌడ్, వరదయ్య, ఏషాల గంగాధర్, దాల్ మల్క పోశెట్టీ, ఫ్యాక్టరీ కార్మిక నాయకులు ఉపేందర్, శ్రీనివాస్, విద్యార్థి సంఘాల నేతలు నాగరాజు, సంజయ్, మోసిన్, గైని రాములు తదితరులు పాల్గొన్నారు.

## సాలూరలో వీధికుక్కల స్వైరవిహారం..
# ఆరుగురికి గాయాలు

**బోధన్, నిజామాబాద్ జిల్లా జులై 09(డీడీ9 వార్త):**

సాలూర మండల కేంద్రంలో వీధికుక్కల స్వైరవిహారం స్థానికులను తీవ్ర భయాందోళనకు గురిచేస్తోంది. గత రెండు రోజులుగా కుక్కలు వరుసగా దాడులకు పాల్పడుతుండగా గురువారం ఒక్కరోజే ఆరుగురిపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. కుక్కల దాడిలో గాయపడిన బాధితులు సాలూర ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. గ్రామంలో కుక్కల బెడద తీవ్రరూపం దాల్చడంతో ప్రజలు బయటకు రావాలంటేనే వణికిపోతున్నారు. ముఖ్యంగా చిన్నారులను పాఠశాలలకు పంపాలంటే తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. పసిపిల్లల నుంచి పెద్దల వరకు ఎవరిని చూసినా వెంబడించి మరీ కుక్కలు దాడి చేస్తుండటంతో గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా వడ్ల దత్తు మాట్లాడుతూ.. "వీధికుక్కల దాష్టీకం రోజురోజుకూ పెరిగిపోతోంది. చిన్నారుల ప్రాణాలకు రక్షణ లేకుండా పోయింది. ఇప్పటికైనా అధికారులు కళ్లు తెరిచి కుక్కల నియంత్రణకు శాశ్వత చర్యలు చేపట్టాలని డిమాండ్



చేశారు. నిద్రమత్తులో ఉన్న స్థానిక అధికారులు స్పందించి, తక్షణమే వీధికుక్కల బెడదను నివారించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## మహారాష్ట్ర మహిళా కూలీలతో ముచ్చటించిన మాజీ మంత్రి హరీష్ రావు

**సిద్దిపేట,డీడీ9 వార్త**

సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం చందలపూర్‌కు వెళ్తున్న సందర్భంగా పెద్దకోడూరు గ్రామ పరిధిలోని రైతు తిరుపతి పొలంలో వరి నాట్లు వేస్తున్న మహిళా కూలీలను చూసిన మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు తన వాహనాన్ని ఆపి వారిని పలకరించారు. రైతుతో మాట్లాడగా, మహారాష్ట్ర రాష్ట్రంలోని చంద్రపూర్ జిల్లా నుంచి మహిళా కూలీలు నాట్లు వేసే పనుల కోసం వచ్చినట్లు తెలుసుకున్న హరీష్ రావు వెంటనే కారులో నుంచి దిగి వారి వద్దకు వెళ్లి ఆప్యాయంగా ముచ్చటించారు. వారి స్వస్థలం, వ్యవసాయ పనులు, ఇక్కడి పని పరిస్థితులు, కూలీ వివరాలను అడిగి తెలుసుకున్నారు. మహిళా కూలీలతో కొంతసేపు ఆత్మీయంగా మాట్లాడిన హరీష్ రావు, వారి శ్రమను అభినందిస్తూ రైతాంగానికి కూలీల సేవలు ఎంతో కీలకమని పేర్కొన్నారు.



## ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం


**అదిలాబాద్ జిల్లా తలమడుగు మండలం (డిడి నైన్ వార్త)జులై 9**



తలమడుగు మండలం ఝరి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు మంథని వ్యవసాయ సహకారసంఘం కార్యదర్శి ఎం అశోక్ కుమార్ ప్రత్యక్ష పరోక్ష బ్యాంక్ అధికారులు మరియు పాలకవర్గాల తీవ్రమైన ఒత్తిడికి గురై గుండెపోటుతో మరణించాడని వ్యవసాయ సహకార సంఘం ఝరి సీఈఓ సుష్టపు రాజు మరియు సబ్ స్టాఫ్ మేస్రం రామచందర్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు సమర్థవంతంగా విధులు నిర్వహిస్తున్న తమపై అధికారులు పాలకవర్గాలు ఇలా ఒత్తిడికి గురి చేయడం భావ్యం కాదని వారు ఆవేదన వ్యక్తం చేశారు రాష్ట్ర ఎంప్లాయిస్ యూనియన్ కమిటీ ఆదేశాల మేరకు తాము నిరసన తెలిపినట్లు వారుతెలిపారు

## అరుదైన శస్త్రచికిత్సతో మహిళకు ప్రాణదానం

**నిజామాబాద్ జిల్లా జులై 09(డీడీ9 వార్త):**



గ్రామీణ ప్రాంత ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో పనిచేస్తున్న భీమ్‌గల్‌లోని శ్రీ శివసాయి మల్టీస్పెషాలిటీ హాస్పిటల్ మరో అరుదైన శస్త్రచికిత్సను విజయవంతంగా పూర్తి చేసి వైద్యరంగంలో తన ప్రత్యేకతను చాటుకుంది. తీవ్రమైన అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరిన 40 ఏళ్ల మహిళ గర్భాశయం మరియు అండాశయం నుండి 14 సెంటీమీటర్ల పరిమాణం గల రెండు భారీ గడ్డలను వైద్యులు సురక్షితంగా తొలగించారు. ఈ అరుదైన ఆపరేషన్‌కు సంబంధించిన వివరాలను ఆసుపత్రి ప్రధాన సర్జన్ డాక్టర్ గల్లా సూర్యనారాయణ శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. భీమ్‌గల్ పరిసర ప్రాంతానికి చెందిన సదరు మహిళ గత కొన్ని రోజులుగా తీవ్రమైన పొట్ట నొప్పి, పొట్ట భాగం గట్టిపడటం, మలమూత్ర విసర్జనలో ఇబ్బందులతో బాధపడుతూ ఐదు రోజుల క్రితం ఆసుపత్రిలో చేరగా, వైద్యులు వెంటనే స్పందించి స్కానింగ్ పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షల్లో గర్భాశయం మరియు అండాశయ భాగంలో సుమారు 14 సెంటీమీటర్ల పరిమాణంలో ఉన్న రెండు గడ్డలను గుర్తించారు.అయితే శస్త్రచికిత్సకు ముందు సదరు మహిళ తీవ్రమైన రక్తహీనతతో బాధపడుతున్నట్లు గుర్తించిన వైద్యులు, ఆమె ప్రాణాలకు ఎలాంటి ముప్పు వాటిల్లకుండా ఉండేందుకు ముందుగా రక్తహీనత నివారణకు అవసరమైన చర్యలు చేపట్టారు. అనంతరం డాక్టర్ గల్లా సూర్యనారాయణ మరియు గైనకాలజిస్ట్ డాక్టర్ ఇందిర గార్ల నేతృత్వంలోని నిపుణులైన వైద్య బృందం అత్యంత సంక్లిష్టమైన శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించి ఆ గడ్డలను తొలగించారు. ప్రస్తుతం రోగి పూర్తిగా కోలుకోవడంతో ఈరోజు ఆమెను డిశ్చార్జ్ చేస్తున్నామని వైద్యులు ప్రకటించారు.bగత ఆరేళ్లుగా ఈ ప్రాంతంలో నిరంతరాయంగా వైద్య సేవలు అందిస్తున్నామని, నిరుపేదలకు ఆర్థిక భారం కాకూడదనే సదుద్దేశంతో అత్యంత తక్కువ ఖర్చుతో కొన్ని సందర్భాల్లో పూర్తిగా ఉచితంగా కూడా శస్త్రచికిత్సలు నిర్వహిస్తున్నామని డాక్టర్ సూర్యనారాయణ పేర్కొన్నారు. ఆసుపత్రి తరఫున నిర్వహించే ఉచిత వైద్య శిబిరాల్లో గుర్తించిన రోగులకు ఎలాంటి రుసుము తీసుకోకుండా ఆపరేషన్లు చేస్తున్నామన్నారు. నగరాలకు పరుగులు తీసి ప్రజలు ఆర్థికంగా ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతోనే భీమ్‌గల్‌లోనే అత్యాధునిక వైద్య సేవలు అందుబాటులో ఉంచామని, ఏ సమస్య ఉన్నా మొదట ఇక్కడికి వచ్చి వైద్య పరీక్షలు చేయించుకోవాలని ఆయన సూచించారు. డాక్టర్ సాయికుమార్ గారి మార్గదర్శకత్వంలో భవిష్యత్తులోనూ ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందిస్తామని, తమ సేవా కార్యక్రమాలకు స్థానిక ప్రజాప్రతినిధులు, మీడియా మిత్రులు అందిస్తున్న సహకారం మరువలేనిదని డాక్టర్ సూర్యనారాయణ తెలిపారు. ఈ సమావేశంలో ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు

## పీడీఎస్ బియ్యం అక్రమ నిల్వలపై నిజామాబాద్ పోలీసుల మెరుపు దాడి

- 15 క్వింటాళ్ల బియ్యం స్వాధీనం

**నిజామాబాద్ జిల్లా జులై 09(డీడీ9 వార్త):**

పేద ప్రజల కోసం ప్రభుత్వం పంపిణీ చేస్తున్న పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా నిల్వ ఉంచి తరలించేందుకు ప్రయత్నిస్తున్న ముఠాపై నిజామాబాద్ సీసీఎస్ పోలీసులు మెరుపు దాడి చేశారు. ఈ దాడుల్లో సుమారు 15 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య వెల్లడించారు. పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు, సీసీఎస్ ఏసీపీ శ్రీశైలం పర్యవేక్షణలో సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ డి.సాయినాథ్, ఎస్ఐ మహేష్ మరియు సిబ్బంది గురువారం సాయంత్రం 5వ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అజమ్ కాలనీలో సోదాలు నిర్వహించారు. దళారుల ద్వారా పేద ప్రజల నుంచి సేకరించిన రేషన్ బియ్యాన్ని, ఇతర ప్రాంతాలకు తరలించే ఉద్దేశంతో ఒక ఇంట్లో నిల్వ ఉంచినట్లు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు అధికారులు ఈ ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ సోదాల్లో 15 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని గుర్తించి స్వాధీనం చేసుకున్న అధికారులు, అక్రమంగా నిల్వ చేసిన రహాన్‌ను అదుపులోకి తీసుకున్నారు. కాగా, ఈ కేసులో మరొక నిందితుడు మోసిన్ పరారీలో ఉన్నాడని, అతనిపై కూడా కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు. ఈ కేసును తదుపరి విచారణ నిమిత్తం 5వ టౌన్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓకు అప్పగించినట్లు అధికారులు పేర్కొన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా పేదలకు అందించే బియ్యాన్ని అక్రమంగా కొనుగోలు చేయడం, నిల్వ చేయడం లేదా రవాణా చేయడం చట్టరీత్యా తీవ్రమైన నేరమని నిజామాబాద్ పోలీసులు హెచ్చరించారు. ఇటువంటి అక్రమ కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేస్తూ సమాజ హితం కోసం ఇటువంటి అక్రమాలపై ప్రజలు పోలీసులకు సమాచారం అందించి సహకరించాలని కోరారు.



## విద్యాసంస్థల బంద్‌కు మద్దతు ప్రకటించిన యంసీపీఐ(యు)

**నిజామాబాద్ జిల్లా జులై 09(డీడీ9 వార్త):**
విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం వామపక్ష విద్యార్థి సంఘాలు జూలై 10న పిలుపునిచ్చిన రాష్ట్రవ్యాప్త విద్యాసంస్థల బంద్‌కు మార్క్సిస్టు కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా (ఐక్య) యంసిపిఐ(యు) తెలంగాణ రాష్ట్ర కమిటీ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ఈ బంద్‌ను జయప్రదం చేయాలని పార్టీ రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి ప్రజలు, ప్రజాస్వామ్యవాదులు, మేధావులను కోరారు. ప్రభుత్వ బడుల మూసివేత నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని, పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, ప్రైవేట్ విద్యాసంస్థల ఫీజుల దోపిడీని అరికట్టాలని ఆయన డిమాండ్ చేశారు.
కార్పొరేట్ విద్యాసంస్థల ఆగడాలను అరికట్టాల్సిన ప్రభుత్వ యంత్రాంగం, అందుకు భిన్నంగా సమస్యలపై ప్రశ్నిస్తున్న విద్యార్థి నాయకులపైనే నాన్ బెయిలబుల్ కేసులు పెట్టి అణిచివేతకు పాల్పడుతోందని రవి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. నిజామాబాద్‌లో విద్యాచట్టాలను ఉల్లంఘించిన ఒక విద్యాసంస్థపై ఫిర్యాదు చేసిన ఏఐవైఎఫ్ డిఎస్ జాతీయ కార్యదర్శి మేత్రి రాజశేఖర్‌తో పాటు మరికొందరు విద్యార్థి నాయకులపై కేసులు నమోదు చేయడం దారుణమని ఆయన పేర్కొన్నారు. కాలేజీ నిబంధనలు ఉల్లంఘించిందని అధికారులు సైతం నిర్ధారించి సీజ్ చేసినా, తప్పుడు సమాచారంతో అధికారులను తప్పుదోవ పట్టించిన యాజమాన్యంపై చర్యలు తీసుకోకుండా ఫిర్యాదు చేసిన విద్యార్థి నాయకులపై కేసులు పెట్టడం ఎంతవరకు ప్రజాపాలన అని ఆయన ప్రశ్నించారు. ఇప్పటికైనా అధికారులు కళ్లు తెరిచి విద్యార్థి నాయకులపై పెట్టిన అక్రమ కేసులను ఉపసంహరించుకోవాలని, నిబంధనలు ఉల్లంఘించిన కాలేజీ యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని యంసిపిఐ(యు) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది.

## గోదావరిఖనిలో అర్బన్ తహసీల్దార్ కార్యాలయం ఏర్పాటు చేయాలి.

- **రామగుండాన్ని రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలి.**
- **రామగుండం స్వచ్ఛంద సంస్థల ఐక్యవేదిక డిమాండ్.**

**డిడి9వార్త / రామగుండం 10:**
గోదావరిఖని పారిశ్రామిక ప్రాంత ప్రజల పరిపాలనా సౌలభ్యం కొరకు ప్రజా అవసరాలను దృష్టిలో ఉంచుకుని గోదావరిఖని పట్టణ కేంద్రంలోనే అర్బన్ తహసీల్దార్ (ఎంఆర్వో) కార్యాలయాన్ని ఏర్పాటు చేయడంతో పాటు రామగుండాన్ని పూర్తిస్థాయి రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలని రామగుండం స్వచ్ఛంద సంస్థల ఐక్యవేదిక ప్రతినిధులు మద్దెల దినేష్, డాక్టర్ దుర్గం నగేష్, అయిత శివకుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.గురువారం గోదావరిఖని చౌరస్తాలో ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనంతరం ప్రజల పరిపాలనా సౌలభ్యం కోసం నూతన జిల్లాలను ఏర్పాటు చేసిన ప్రభుత్వం, గోదావరిఖని ప్రధాన పారిశ్రామిక ప్రాంత ప్రజల అవసరాలను మాత్రం విస్మరించిందని విమర్శించారు. అన్ని అర్హతలు, రవాణా సౌకర్యాలు ఉన్నప్పటికీ స్వార్థ రాజకీయాల కారణంగా గోదావరిఖనికి దక్కాల్సిన జిల్లా కేంద్ర హోదా పెద్దపల్లికి వెళ్లిపోయిందని పేర్కొన్నారు.అప్పట్లో రామగుండాన్ని రెవెన్యూ డివిజన్‌గా అభివృద్ధి చేస్తామని పాలకులు ఇచ్చిన హామీ ఇప్పటికీ అమలు కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం రామగుండం నియోజకవర్గంలోని 60 డివిజన్లలో సుమారు 1.78 లక్షల మంది ప్రజలు నివసిస్తున్నారని, ఆదాయ, కుల, నివాస ధ్రువపత్రాలు, భూ సంబంధిత సేవలు తదితర రెవెన్యూ పనుల కోసం దూరంలోని కార్యాలయానికి వెళ్లాల్సి రావడం వల్ల విద్యార్థులు, ఉద్యోగార్థులు, మహిళలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రయాణ భారం, సమయ వృథాతో పాటు రోడ్డు ప్రమాదాలు కూడా చోటుచేసుకుంటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.గోదావరిఖని పట్టణ




కేంద్రంలో అర్బన్ తహసీల్దార్ కార్యాలయాన్ని ఏర్పాటు చేయడం ద్వారా లక్షలాది మంది ప్రజలకు పరిపాలనా సేవలు చేరువ అవుతాయని పేర్కొన్నారు. అలాగే రామగుండాన్ని పూర్తిస్థాయి రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించడం ద్వారా పరిపాలనా వ్యవస్థ మరింత సమర్థవంతంగా పనిచేస్తుందని తెలిపారు.
రాష్ట్ర ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యే, మంత్రులు, జిల్లా కలెక్టర్, సంబంధిత అధికారులు ప్రజల చిరకాల డిమాండ్‌ను వెంటనే నెరవేర్చాలని కోరారు. లేనిపక్షంలో స్వచ్ఛంద సంస్థల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ప్రజలతో కలిసి ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షురాలు చంద్రకళ, కార్యదర్శి కొంకటి రవి, కంది సుజాత, సరిత లక్ష్మి, రామాదేవి, మండల శ్రీనివాస్, షీరీష, శుశీల, శారదా, మల్లేష్, శివ, తొ పాటు తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యాసంస్థలు బంద్ ను పాటించాలి

- **బీడీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు సంజయ్ తలారే పిలుపు**

**బోధన్, నిజామాబాద్ జిల్లా జులై 09(డీడీ9 వార్త):**
విద్యా రంగాన్ని నిర్వీర్యం చేసే ప్రభుత్వ నిర్ణయాలకు వ్యతిరేకంగా, విద్యార్థుల హక్కుల సాధన కోసం జూలై 10న చేపట్టిన విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని బహుజన డెమోక్రటిక్ స్టూడెంట్ ఫెడరేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు సంజయ్ తలారే పిలుపునిచ్చారు. బోధన్ పట్టణంలోని పీఆర్‌టీయూ భవన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం 27 వేల ప్రభుత్వ పాఠశాలలను 4 వేలకు కుదించాలనే ఆలోచనను వెంటనే విరమించుకోవాలని, ఖాళీగా ఉన్న టీచర్, లెక్చరర్ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.
ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు రెండు జతల యూనిఫామ్స్, పాఠ్యపుస్తకాలను పంపిణీ చేయడంతో పాటు మధ్యాహ్న భోజన పథకానికి నిధులు పెంచాలని ఆయన కోరారు. ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల దోపిడీని అరికట్టేందుకు ఫీజు నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. జీవో నెంబర్లు 7, 8, 9లను రద్దు చేయాలని, ఇంటర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని వెంటనే ప్రారంభించాలని కోరారు. బహుజన విద్యార్థుల సౌకర్యార్థం ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ హాస్టళ్లు, గురుకులాలకు సొంత భవనాలు నిర్మించాలని, ప్రతి విద్యార్థికి ఉచిత రవాణా సౌకర్యం లేదా బస్సు పాసులు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. విద్యారంగంలో పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్, కాస్మోటిక్ చార్జీలను పెంచాలని, ప్రతి పాఠశాలలో విద్యుత్, ఇంటర్నెట్, త్రాగునీరు, మరుగుదొడ్ల వంటి మౌలిక వసతులు కల్పించాలని సూచించారు. విద్యా సంస్థల్లో ర్యాగింగ్, డ్రగ్స్ నిరోధక కమిటీలను ఏర్పాటు చేయాలని, విద్యాహక్కు చట్టం ప్రకారం బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు 25 శాతం సీట్లు ఉచితంగా కల్పించాలని కోరారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు విద్య భరోసా కార్డ్‌స్‌ను ఉచితంగా అందజేయాలని, నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ 2020ని తెలంగాణలో అమలు చేయకుండా అసెంబ్లీలో తీర్మానం చేయాలని సంజయ్ తలారే డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బోధన్ డివిజన్ అధ్యక్షులు శ్రీకిరణ్, కార్యదర్శి నరేందర్, నాయకులు మధు, అర్జున్, మాధవ్ తదితరులు పాల్గొన్నారు.




## సన్న వడ్ల సాగు నారును పరిశీలించిన మండల వ్యవసాయ అధికారి కే సతీష్ కుమార్.

**డిడి9వార్త / పెద్దపల్లి జులై 10:**
పెద్దపల్లి జిల్లా అంతర్గం మండల మండల కేంద్రం లో సన్న రకాల వడ్లు సాగు చేసిన వరి నారుమడులు మండల వ్యవసాయ అధికారి కె. సతీష్ కుమార్ పలిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి రైతులతోమాట్లాడుతూ కాండంతొలుచు పురుగు, ఉల్లికోడు, ఇతర పురుగుల నుండి ముందస్తు రక్షణ కొరకు



నారు తీయడానికి, వారం రోజుల ముందు కార్బోఫ్యూరాన్ 3జి గులికలు ఒక సెంటు నారుమడికి 160 గ్రాములు, చొప్పున వేయాలి. నారు మడుల్లో తెగుళ్ల నివారణ కు+కార్బన్డిజమ్+ మ్యాంకోజెన్) మందును పిచికారి చేయాలి. అగ్గితెగులు నివారణ కు ట్రైసైక్లోజోల్ 2.5 మిల్లి లీటర్లు , లేదా ఇసోప్రోథోలిన్ 1.5 ఎం ఎల్ మందును లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. అలాగే 16నుండి 30రోజుల వయస్సు ఉన్నలేత వరి నారు నాటుకోవాలి, వరి నాటు వేసేటప్పుడు నారు కొనాలని కత్తరించి నాటుకోవాలి.తూర్పుపడమర దిశలో ఉండేలా ప్రతి 2 మీటర్ల కి 20 సెంటీమీటర్ల కాలిబాటలు తీయాలి. తద్వారా గాలి, వెలుతురు బాగా సోకి, చీడపీడల వ్యాప్తి తగ్గుతుందని రైతులకు అవగాహన కల్పించిన అంతర్గాం మండల వ్యవసాయ అధికారి కే సతీష్ కుమార్. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి సతీష్ కుమార్,రైతులు పాల్గొన్నారు.

## రామక్కపేట గ్రామంలో SIR ప్రక్రియపై ప్రజలకు అవగాహన కల్పించిన బీఆర్ఎస్ నాయకులు

**మంగపేట జూలై 09డీడీ 9 వార్త**
మంగపేట మండలం రామక్కపేట గ్రామంలో ఈరోజు ములుగు నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి బడే నాగజ్యోతి , బీఆర్ఎస్ పార్టీ ములుగు జిల్లా మాజీ అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు ఆదేశాల మేరకు బీఆర్ఎస్ నాయకులు గ్రామంలోని ప్రతి ఇంటిని సందర్శించి SIR (Special Intensive Revision) ప్రక్రియను పరిశీలించారు. అలాగే ఈ ప్రక్రియపై ప్రజలకు అవగాహన కల్పించారు.
ఈ సందర్భంగా బీఎల్ఏ, బీఎల్ఓలను కలిసి SIR ప్రక్రియ ఎలా అమలవుతోందనే విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ, 18 సంవత్సరాలు నిండిన ప్రతి పౌరుడు ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకుని తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. ఓటు హక్కు భారత రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కు అని, అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా చూసుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మాజీ మండల ప్రధాన కార్యదర్శి గుండేటి రాజు యాదవ్, మాజీ మండల యూత్ అధ్యక్షుడు గుమ్మల వీరస్వామి, బీఎల్ఏ మంచాల నాగేంద్ర కుమార్, మాచర్ల మురళి, గుమ్మల కోటేశ్వరావు, ఓదెల సుధీర్, తోకల ప్రవీణ్ సాయి, వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.



## బోధన్‌లో సర్పంచులు, కార్యదర్శులకు దిశానిర్దేశం

**బోధన్, నిజామాబాద్ జిల్లా జులై 09(డీడీ9 వార్త):**
గ్రామ పంచాయతీల సమగ్ర అభివృద్ధి ప్రణాళిక, ప్రాధాన్యత పనుల గుర్తింపుపై బోధన్‌లోని లయన్స్ క్లబ్ సమావేశ మందిరంలో గురువారం సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సదస్సులో వీబీజీగ్రామ్, అంతర్‌శాఖల సమన్వయం, తాగునీరు, పారిశుధ్యం తదితర అంశాలపై క్షేత్రస్థాయిలో చేపట్టాల్సిన చర్యలపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి ఏసీఎల్బీ భుజంగరావు, జిల్లా నోడల్ అధికారి సుబ్రహ్మణ్యం, జెడ్పీ సీఈఓ సాయాగౌడ్, డీఆర్డీఓ సాయన్న, బోధన్, ఆర్మూర్ డీఎల్పీఓలు హాజరయ్యారు. వీరితో పాటు ఎంపీడీఓలు, ఎంపీఓలు, పీఆర్ ఇంజనీరింగ్, ఆర్డబ్ల్యూఎస్, మిషన్ భగీరథ అధికారులు పాల్గొనగా, బోధన్ డివిజన్‌కు చెందిన సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు హాజరై శిక్షణ పొందారు.




## సీతక్క పుట్టినరోజు సందర్భంగా విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ

**మంగపేట,జూలై 09డీడీ 9 వార్త**
రాష్ట్ర మంత్రి సీతక్క జన్మదినాన్ని పురస్కరించుకుని మంగపేట మండల పాస్టర్స్ కమిటీ ట్రెజరర్ పాస్టర్ జానేష్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పలకలు, నోటుబుక్స్, పెన్నులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాస్టర్ జానేష్ మాట్లాడుతూ, సీతక్క సేవా స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని విద్యార్థులకు అవసరమైన విద్యా సామగ్రిని అందించడం ఆనందంగా ఉందన్నారు. సమాజ అభివృద్ధికి విద్యే ప్రధాన ఆయుధమని, ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక పాస్టర్స్, నాయకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



## మంత్రి సీతక్కకు "కామధేను" బహూకరించిన నాసిరెడ్డి సాంబశివరెడ్డి...

- **"కామధేను" చూసి మురిసిన మంత్రి సీతక్క....**

**మంగపేట జూలై 09డీడీ 9 వార్త**




గురువారం ములుగు జిల్లా కేంద్రంలో నిర్వహించిన రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క జన్మదిన వేడుకల్లో జాతీయ మిర్చి టాస్క్ ఫోర్స్ డైరెక్టర్ కాంగ్రెస్ నాయకులు నాసిరెడ్డి సాంబశివరెడ్డి పాల్గొని మంత్రి సీతక్కను శాలువాతో ఘనంగా సన్మానించి హిందువుల పూజకు ప్రతీక, శుభానికి సంకేతం ఐన "కామదేను" (ఆవు మరియు లేగ దూడ) కలప ప్రతిమను బహూకరించి మంత్రి సీతక్కకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు ఈ సందర్భంగా సాంబశివరెడ్డి మాట్లాడుతూ దేవుడు సీతక్కకు ఆయురారోగ్యాలను ప్రసాదించాలని దేవుడిని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు.

**కామధేను చూసి మురిసిన మంత్రి సీతక్క...**
తన జన్మదిన కానుక గా కాంగ్రెస్ నాయకులు, జాతీయ మిర్చి టాస్క్ ఫోర్స్ డైరెక్టర్ నాసిరెడ్డి సాంబశివరెడ్డి తనకు ప్రేమతో బహూకరించిన "కామధేను" ప్రతిమను చూసి మంత్రి సీతక్క మురిసిపోయారు తన ప్రతి జన్మదిన వేడుకల సందర్భంగా వ్యవసాయానికి చిహ్నమైన ఏదో ఒక బహుమతిని సాంబశివరెడ్డి ఇస్తారని సాటి కాంగ్రెస్ నాయకులతో వ్యాఖ్యానించి సాంబశివరెడ్డిని అభినందించారు.

## బీఆర్ఎస్ కుటుంబానికి అండగా భూక్య జంపన్న.. దుఃఖంలో ఉన్న నాయకుడి కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సహాయం

**మంగపేట జూలై 09డీడీ 9 వార్త**
కష్టసుఖాల్లో పార్టీ కార్యకర్తలు, నాయకులకు అండగా నిలవడమే నిజమైన నాయకత్వమని బీఆర్ఎస్ ములుగు నియోజకవర్గ జిల్లా నాయకులు భూక్య జంపన్న మరోసారి చాటిచెప్పారు. ములుగు జిల్లా వెంకటాపురం మండలం పాలంపేట గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు కనకం సంపత్ కుమార్తె తేజశ్రీ (17) ఇటీవల మృతిచెందిన విషయం తెలుసుకున్న భూక్య జంపన్న వారి నివాసానికి వెళ్లి మృతురాలికి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.
ఈ సందర్భంగా తీవ్ర మనోవేదనలో ఉన్న కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతూ, కష్టకాలంలో తాను అండగా ఉంటానని భరోసా కల్పించారు. అనంతరం తన వంతుగా కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేసి మానవత్వాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో స్వామి , రవీందర్ , యూత్ అధ్యక్షులు ప్రశాంత్ , మహమ్మద్ అఖిల్ , పైడి, రాజు , అంజి , కిషోర్ , కళ్యాణ్ , సందీప్ , సాధి , రామ్ , బాబి , వంశి , గ్రామ పెద్దలు, బీఆర్ఎస్ నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు



## నేడు రాష్ట్రవ్యాప్త విద్యాసంస్థల బంద్

- **విద్యారంగ సమస్యల పరిష్కారానికి వామపక్ష విద్యార్థి సంఘాల పిలుపు**

**పెద్దపల్లి బ్యూరో, జూలై 09(డీడీ9 వార్త):**
విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఈరోజు జరిగే రాష్ట్రవ్యాప్త విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో గోదావరిఖని పారిశ్రామిక ప్రాంతంలో కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం మాట్లాడుతూ... ప్రభుత్వ పాఠశాలల విలీన నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని, విద్యాశాఖకు పూర్తి స్థాయి మంత్రిని నియమించాలని, విద్యార్థులకు యూనిఫాంలు, పాఠ్యపుస్తకాలు, స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ, లెక్చరర్, ఎంఈఓ, డీఈఓ పోస్టులను భర్తీ చేయడంతో పాటు, ప్రభుత్వ విద్యాసంస్థల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని, ప్రైవేట్ విద్యాసంస్థల ఫీజులను నియంత్రించేందుకు చట్టం తీసుకురావాలని, విద్యార్థులకు ఉచిత రవాణా, బస్సు పాసులు, ల్యాప్‌టాప్‌లు అందించాలని కోరారు. డిమాండ్లు నెరవేర్చని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి గుండ్ల లక్ష్మీప్రసన్న, తడిగొప్పుల అనుప్ సాయి, గుండ్ల సూర్యప్రకాశ్, అభిషేక్, వైశాలి, చైత్ర తదితరులు పాల్గొన్నారు.



# రూ.6 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు భూమిపూజ చేసిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు..

- **అనంతరం ఏటీసీ విద్యార్థి ప్రతిభను అభినందించిన ఎమ్మెల్యే.**

**మణుగూరు.జూలై 9(డి డి 9వార్త)**

భద్రాద్రి జిల్లా,మణుగూరు మండలంలోని ముత్యాలమ్మ నగర్ గ్రామపంచాయతీ పరిధిలో గల ప్రభుత్వ ఐటీఐ కళాశాల సమీపంలో రూ.6 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు .ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. ప్రతి కాలనీ, ప్రతి గ్రామంలో అవసరమైన అభివృద్ధి పనులను దశలవారీగా చేపడుతూ రహదారులు, డ్రైనేజీలు, తాగునీటి సౌకర్యాలు, వీధి దీపాలు వంటి మౌలిక సదుపాయాలను కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. రూ.6 లక్షల వ్యయంతో నిర్మించనున్న ఈ సీసీ రోడ్డు పూర్తయిన తర్వాత స్థానిక ప్రజలకు రాకపోకలు మరింత సౌకర్యవంతంగా మారడంతో పాటు వర్షాకాలంలో బురద, నీటి నిల్వల సమస్యలు తొలగిపోతాయని తెలిపారు. పనులను నాణ్యతతో, నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

అనంతరం మణుగూరు ప్రభుత్వ ఐటీఐ/ఏటీసీని సందర్శించిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మెకానిక్ ఎలక్ట్రిక్ వెహికల్ కోర్సు ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థి పి. పార్థసారథి స్వయంగా రూపొందించిన పర్యావరణ హిత (ఎకో ఫ్రెండ్లీ) ఎలక్ట్రిక్ వాహనాన్ని పరిశీలించి విద్యార్థిని ప్రత్యేకంగా అభినందించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, యువత ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం నైపుణ్యాభివృద్ధికి అత్యంత ప్రాధాన్యతనిస్తూ ఏటీసీ (Advanced Technology Centres) లను ఏర్పాటు చేసిందని పేర్కొన్నారు. ఏటీసీలో శిక్షణ పూర్తి చేసిన విద్యార్థులకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా కృషి చేయాలని ఐటీఐ ప్రిన్సిపాల్‌కు సూచించారు. ఇలాంటి ప్రతిభావంతులైన విద్యార్థులను మరింతగా తీర్చిదిద్దాలని, పి. పార్థసారథి భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదిగి మరెందరికో ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో మండల మరియు పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు, జిల్లా మరియు మండల ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలతో పాటు ఐటీఐ ప్రిన్సిపాల్ ఓ. సారంగపాణి, మాస్టర్ ట్రైనర్ పూర్ణచందర్ రావు, ఎలక్ట్రిక్ వెహికల్ కోర్స్ ఇన్‌చార్జి బి. అశోక్ కుమార్, నూతన్, శివ గణేష్, పి. సుమంత్, శివ కుమార్, సాయి చందు, సునాద్, శివాజీ మరియు విద్యార్థులు పాల్గొన్నారు.



# 109 మందికి కంటి పరీక్షలు.. 46 మందికి ఉచిత ఆపరేషన్‌కు ఎంపిక

- **లయన్స్ క్లబ్ ఆఫ్ గోదావరిఖని స్ఫూర్తి ఆధ్వర్యంలో ఎన్‌టీపీసీ సాయి సేవా సమితిలో ఉచిత కంటి శిబిరం**

**పెద్దపల్లి బ్యూరో, జూలై 09(డీడీ9 వార్త):**

లయన్స్ క్లబ్ ఆఫ్ గోదావరిఖని స్ఫూర్తి ఆధ్వర్యంలో, రేకుర్తి కంటి ఆసుపత్రి సహకారంతో ఎన్‌టీపీసీ సాయి సేవా సమితిలో ఉచిత కంటి పరీక్షలు, ఆపరేషన్ ఎంపిక శిబిరాన్ని నిర్వహించారు. శిబిరానికి 109 మంది హాజరుకాగా, వైద్య పరీక్షల అనంతరం 46 మందిని కంటి ఆపరేషన్ కోసం రేకుర్తి ఆసుపత్రికి తరలించారు.

రేకుర్తి ఆసుపత్రి టెక్నీషియన్ ప్రభాకర్ పరీక్షలు నిర్వహించగా, ఎంపికైన వారికి ఈరోజు తుది వైద్య పరీక్షలు చేసి, రేపు ఉచితంగా శస్త్ర చికిత్స నిర్వహించి, అనంతరం తిరిగి స్వస్థలాలకు తీసుకువస్తామని క్లబ్ అధ్యక్షుడు ఎల్ఎన్ కోదాటి ప్రవీణ్, కార్యదర్శి ఎల్ఎన్ ఎతిరాజు సురేష్, ఖజాంచి ఎల్ఎన్ రెడ్డి రవీందర్ రెడ్డి తెలిపారు.

ఈ కార్యక్రమానికి డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ నార్ల ప్రసాద్ ముఖ్య అతిథిగా, కొమురవెల్లి సుధాకర్, మామిడిపల్లి శ్రీధర్, గోపాల్‌రావు, గుంత వినోద్ తదితరులు విశిష్ట అతిథులుగా హాజరయ్యారు. అలాగే లయన్స్ క్లబ్ సభ్యులు, సాయి సేవా సమితి నిర్వాహకులు అశోక్ రెడ్డి, వేణు, నర్సయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.




# త్రిలింగ రాజరాజేశ్వరి ఆలయానికి తక్షణ మరమ్మతులు చేపట్టాలి: సీపీఐ

- **జనగామ ఆలయాన్ని పరిశీలించిన సీపీఐ నేత తొడుపునూరి రమేశ్ కుమార్**
- **లీకేజీలు, దెబ్బతిన్న రేకులు, పారిశుద్ధ్య సమస్యలు పరిష్కరించాలని డిమాండ్**

**పెద్దపల్లి బ్యూరో, జూలై 09(డీడీ9 వార్త):**

రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 6వ డివిజన్ జనగామలో ఉన్న త్రిలింగ రాజరాజేశ్వరి ఆలయానికి తక్షణమే మరమ్మతులు చేపట్టి భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు తొడుపునూరి రమేశ్ కుమార్ డిమాండ్ చేశారు.

గురువారం ఆలయాన్ని సందర్శించి పరిస్థితిని పరిశీలించిన ఆయన మాట్లాడుతూ..., ఆలయ పైకప్పు నుంచి వర్షపు నీరు కారడం వల్ల భక్తులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గాలివానలకు దెబ్బతిన్న రేకుల పందిరిని వెంటనే పునరుద్ధరించాలని, ఆలయం చుట్టూ పెరిగిన గుబురు మొక్కలను తొలగించి పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచాలని కోరారు. విషసర్పాలు, పురుగుల సంచారంతో భక్తులకు ప్రమాదం పొంచి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

ఆలయ పరిసరాల్లో పారిశుద్ధ్య సిబ్బందిని ఏర్పాటు చేయడంతో పాటు, ఆలయ అభివృద్ధి, నిర్వహణపై దేవాలయ కమిటీ ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. మున్సిపల్ కార్పొరేషన్, సింగరేణి, దేవాదాయ శాఖ అధికారులు వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు.



# రామగుండంను రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలి

**గోదావరిఖని డీడీ9 వార్త**

రామగుండం ను పూర్తిస్థాయి రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలని రామగుండం స్వచ్ఛంద సంస్థల ఐక్యవేదిక ప్రతినిధులు మద్దెల దినేష్, డాక్టర్ దుర్గం నగేష్, అయిత శివకుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం స్థానిక ప్రధాన చౌరస్తాలో ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనంతరం ప్రజల పరిపాలనా సౌలభ్యం కోసం నూతన జిల్లాలను ఏర్పాటు చేసిన ప్రభుత్వం గోదావరిఖని పారిశ్రామిక ప్రాంత ప్రజల అవసరాలను మాత్రం విస్మరించిందని విమర్శించారు .అన్ని అర్హతలు, రవాణా సౌకర్యాలు ఉన్నప్పటికీ స్వార్థ రాజకీయాల కారణంగా గోదావరిఖనికి దక్కాల్సిన జిల్లా హోదా పెద్దపల్లికి వెళ్లిపోయిందని పేర్కొన్నారు.

రామగుండాన్ని రెవెన్యూ డివిజన్‌గా అభివృద్ధి చేస్తామని అప్పటి పాలకులు ఇచ్చిన హామీ ఇప్పటికీ అమలు కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రామగుండాన్ని పూర్తిస్థాయి రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించడం ద్వారా పరిపాలనా వ్యవస్థ మరింత సమర్థవంతంగా పనిచేస్తుందని తెలిపారు.

రాష్ట్ర ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యే, మంత్రులు, జిల్లా కలెక్టర్, సంబంధిత అధికారులు ప్రజల చిరకాల డిమాండ్‌ను వెంటనే నెరవేర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాక్షురాలు చంద్రకళ, కార్యదర్శి కొంకటి రవి, కంది సుజాత, సరిత లక్ష్మి, రామాదేవి, మండల శ్రీనివాస్, షీరీష, శుశీల, శారదా, మల్లేష్, శివ తదితరులు పాల్గొన్నారు.




## మంత్రి సీతక్క జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించిన కాంగ్రెస్ శ్రేణులు

**వాజేడు, జూలై 9 (డీడీ9 వార్త):**

ములుగు జిల్లా వాజేడు మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానికంగా ప్రసాద్ బాబు నివాస ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కేక్ కట్ చేసి మంత్రి సీతక్కకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

కాంగ్రెస్ పార్టీ ములుగు జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి కాకర్లపూడి విక్రాంత్ బాబు, కాంగ్రెస్ పార్టీ కార్యవర్గ సభ్యుడు చెన్నం ఎల్లయ్య ఆధ్వర్యంలో ఈ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కాకర్లపూడి విక్రాంత్ బాబు మాట్లాడుతూ గిరిజన కుటుంబంలో జన్మించిన సీతక్క కష్టపడి ఉన్నత స్థాయికి చేరుకుని మంత్రిగా ములుగు జిల్లాతో పాటు రాష్ట్ర ప్రజలకు విశేష సేవలు అందిస్తున్నారని కొనియాడారు. ప్రజా సేవలో ఆమె చూపుతున్న నిబద్ధత ఆదర్శప్రాయమని, మహిళా ప్రజాప్రతినిధులు సీతక్కను స్ఫూర్తిగా తీసుకుని ప్రజలకు సేవ చేయాలని ఆయన కోరారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రజల అభిమానాన్ని, ఆశీస్సులను పొందుతున్న సీతక్క నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ వాజేడు మండల మాజీ అధ్యక్షుడు దాట్ల సీతారామరాజు, సొసైటీ ఉపాధ్యక్షుడు వత్సవాయి జగన్నాధరాజు, మాజీ జెడ్పీటీసీ తల్లడి పుష్పలత, వాజేడునాగారం సర్పంచ్ బోధిబోయిన స్వరూప, ఆత్మ డైరెక్టర్ గౌరారపు వెన్నెల, వార్డు సభ్యురాలు జాక పార్వతి, కాంగ్రెస్ నాయకులు కాకర్లపూడి కళ్యాణ్, ఎస్.కే. కాజావలి, షబ్బీర్, చెన్నం శ్రీను, చెన్నం సురబాబు, చెన్నం మోహన్‌రావు, ఎట్టి లక్ష్మయ్య, అనుముల సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.





# తాడిచెర్ల బొగ్గు గని బ్లాక్-2 సింగరేణికి కేటాయింపు చారిత్రాత్మక నిర్ణయం

- **కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డికి శంషాబాద్ విమానాశ్రయంలో ఘన స్వాగతం పలికిన కందుల సంధ్యారాణి**

**పెద్దపల్లి బ్యూరో, జూలై 09(డీడీ9 వార్త):**

తాడిచెర్ల బొగ్గు గని బ్లాక్2ను సింగరేణి సంస్థకు కేటాయిస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తూ, శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి వచ్చిన కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డికి బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కందుల సంధ్యారాణి తట్ట చెమ్మస్ బహుకరించి ఘన స్వాగతం పలికారు.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ....తెలంగాణ ప్రజల చిరకాల ఆకాంక్ష అయిన తాడిచెర్ల బొగ్గు గనిని సింగరేణికి కేటాయించడం కేంద్ర ప్రభుత్వం తీసుకున్న చారిత్రాత్మక నిర్ణయమని పేర్కొన్నారు. ఈ నిర్ణయంతో సింగరేణి సంస్థ మరింత బలోపేతం కావడంతో పాటు వేలాది మంది కార్మికులకు ఉపాధి భద్రత కలిగి, సంస్థ విస్తరణకు కొత్త అవకాశాలు ఏర్పడతాయని తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ, కార్మికుల సంక్షేమం, దేశ ఇంధన భద్రతకు ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొంటూ, కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి ప్రత్యేక చొరవతోనే ఈ కేటాయింపు సాధ్యమైందని కొనియాడారు.

సింగరేణి అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తుందని, తెలంగాణ పారిశ్రామికాభివృద్ధిలో సంస్థ మరింత కీలక పాత్ర పోషించేలా చర్యలు కొనసాగుతాయని తెలిపారు.

ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్, ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు ముకేశ్ గౌడ్, మాజీ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు చందుపట్ల సునీల్ రెడ్డి, దుర్గం అశోక్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందుగుల శ్రీనివాస్, పూనమ్ చంద్ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్జీ1 నర్సరీ కార్మికులకు వెంటనే ఉపాధి కల్పించాలి

- **డీవైజీఎం ఫారెస్ట్ అధికారి బానోత్ కర్ణకు ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో వినతిపత్రం**

**పెద్దపల్లి బ్యూరో, జూలై 09(డీడీ9 వార్త):**

ఆర్జీ 1 పరిధిలోని నర్సరీ కార్మికులకు వెంటనే ఉపాధి కల్పించాలని ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో కార్మికులు డీవైజీఎం (ఫారెస్ట్) అధికారి బానోత్ కర్ణను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల వెంకన్న మాట్లాడుతూ..., ఆర్జీవన్ నర్సరీలో పనిచేస్తున్న కార్మికులు పనులు లేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఎన్నో సంవత్సరాలుగా నర్సరీ అభివృద్ధికి సేవలందించిన కార్మికులను పనులు లేకుండా ఉంచడం సరైంది కాదని, వెంటనే నర్సరీ నిర్వహణ, మొక్కల సంరక్షణ, హరిత కార్యక్రమాలకు సంబంధించిన పనులు అప్పగించి వారికి నిరంతర ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి. అశోక్ మాట్లాడుతూ... నర్సరీ కార్మికుల జీవనోపాధి పూర్తిగా ఈ పనులపైనే ఆధారపడి ఉందని, యాజమాన్యం మానవతా దృక్పథంతో స్పందించి పెండింగ్‌లో ఉన్న పనులను ప్రారంభించి కార్మికులకు ఉపాధి కల్పించాలని కోరారు. సమస్య పరిష్కారంలో జాప్యం జరిగితే కార్మికులతో కలిసి ఆందోళన కార్యక్రమాలు చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. వినతిపత్రాన్ని స్వీకరించిన డీవైజీఎం (ఫారెస్ట్) అధికారి బానోత్ కర్ణ, కార్మికుల సమస్యలను పరిశీలించి యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల వెంకన్న, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి. అశోక్, నర్సరీ కార్మికులు మరియు యూనియన్ నాయకులు పాల్గొన్నారు.



# అపన్నుడికి అండగా నిలిచిన సీహెచ్‌పీ ఉద్యోగులు

- **విద్యుత్ షాక్‌తో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బొలెరో డ్రైవర్‌కు రూ.1.00 లక్షల ఆర్థిక సాయం**

**పెద్దపల్లి బ్యూరో, జూలై 09(డీడీ9 వార్త):**

ఓసీపీ1 సీహెచ్‌పీలో బొలెరో డ్రైవర్‌గా పనిచేస్తున్న మెట్టు రవి విద్యుత్ షాక్‌కు గురై తీవ్రంగా గాయపడటంతో, సీహెచ్‌పీ ఉద్యోగులు మానవత్వాన్ని చాటుతూ రూ.1,00,200 ఆర్థిక సాయం అందజేశారు. రత్నాపూర్‌కు చెందిన మెట్టు రవి డ్యూటీ అనంతరం పార్ట్‌టైమ్ పనిలో భాగంగా గ్రామంలో వీధి దీపాలు అమర్చుతుండగా విద్యుత్ షాక్ తగిలి విద్యుత్ స్తంభం పై నుంచి కిందపడిపోయాడు. ప్రస్తుతం కరీంనగర్‌లోని మయూఖ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆయన పరిస్థితి విషమంగా ఉందని తెలుసుకున్న సీహెచ్‌పీ ఉద్యోగులు స్వచ్ఛందంగా విరాళాలు సేకరించి రూ.1,00,200ను ఆయన కుమారుడికి అందజేశారు.

ఈ కార్యక్రమంలో డీవైజీఎంలు కాశీ విశ్వేశ్వరరావు, గవ్వల శ్రీనివాస్, డీవైఎస్ఈ అనిల్ కుమార్, పిట్ సెక్రటరీలు గంధం శ్రీనివాస్, కిషన్ నాయక్, వివిధ కార్మిక సంఘాల నాయకులు, ఇంజినీర్లు, సూపర్వైజర్లు, షిఫ్ట్ ఇన్‌చార్జీలు, మహిళా ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొన్నారు.



DD9 వార్త
తెలుగు దినపత్రిక
DD9 Vaartha
శుక్రవారం
10-07-2026
హైదరాబాద్

# గ్రామాల సమగ్ర అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా పనిచేయాలి..

- **సర్పంచులు, పంచాయతీ కార్యదర్శుల శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు.**



**మణుగూరు.జూలై 9(డి డి 9వార్త)**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గ్రామపంచాయతీల సమగ్ర అభివృద్ధి ప్రణాళిక (GPDP) అమలుపై సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పాల్గొని ప్రసంగించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామాల అభివృద్ధి ప్రజల భాగస్వామ్యంతోనే సాధ్యమవుతుందని అన్నారు. ప్రతి గ్రామంలో స్థానిక అవసరాలను గుర్తించి తాగునీరు, పారిశుద్ధ్యం, సీసీ రోడ్లు, డ్రైనేజీలు, వీధి దీపాలు, పచ్చదనం, విద్య, వైద్యం వంటి మౌలిక సదుపాయాలకు ప్రాధాన్యతనిస్తూ సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని సూచించారు. గ్రామసభల్లో ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని, వాటికి అనుగుణంగా అభివృద్ధి పనులను అమలు చేస్తే గ్రామాలు అన్ని రంగాల్లో ఆదర్శంగా నిలుస్తాయని పేర్కొన్నారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం గ్రామీణ పేదల జీవితాల్లో వెలుగులు నింపే మహత్తర సంక్షేమ కార్యక్రమమని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. అర్హులైన ప్రతి లబ్ధిదారునికి పారదర్శకంగా పథకం ప్రయోజనాలు అందేలా సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఇళ్ల నిర్మాణ పనులు నాణ్యతతో, నిర్ణీత గడువులో పూర్తి అయ్యేలా నిరంతరం పర్యవేక్షించాలని, లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. ప్రతి పేద కుటుంబం సొంత ఇంటి కలను సాకారం చేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.

గ్రామపంచాయతీల సమగ్ర అభివృద్ధి ప్రణాళిక (GPDP) కింద 2026-2029 ఆర్థిక సంవత్సరాలకు గ్రామాల అవసరాలకు అనుగుణంగా అంచనా బడ్జెట్‌ను రూపొందించాలని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సూచించారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్వచ్ఛ భారత్ మిషన్ (గ్రామీణ), పంచాయతీరాజ్ ఇంజినీరింగ్, మిషన్ భగీరథ, SERP, స్త్రీనిధి తదితర శాఖల నిధులను సమన్వయం చేసి గ్రామాల సమగ్ర అభివృద్ధికి వినియోగించాలని తెలిపారు. గ్రామసభల ద్వారా ప్రజల అవసరాలను గుర్తించి కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తే మౌలిక సదుపాయాల కల్పన, తాగునీరు, పారిశుద్ధ్యం, రహదారులు, మహిళా సాధికారత, ఉపాధి వంటి రంగాల్లో వేగవంతమైన అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. అందుబాటులో ఉన్న ప్రతి రూపాయి ప్రజలకు ఉపయోగపడేలా పారదర్శకంగా, బాధ్యతాయుతంగా వినియోగించాలని సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు సూచించారు.

ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అర్హులైన ప్రతి కుటుంబానికి చేరవేయడంలో గ్రామపంచాయతీలు కీలక పాత్ర పోషించాలని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తే గ్రామాల అభివృద్ధి మరింత వేగవంతమవుతుందని, ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టే విధంగా ప్రతి ఒక్కరూ బాధ్యతతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, జిల్లా అధికారులు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, ప్రజాప్రతినిధులు మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# గ్రామ దేవత పోచమ్మకు మొక్కులు చెల్లించి, చెట్ల తీర్థాలకు తరలిన అకెన పల్లిగ్రామ ప్రజలు.

**డిడి9వార్త / పెద్దపల్లి జులై 10:**

పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలం అకెన పల్లి గ్రామంలో సర్పంచ్ గాదె స్రవంతి సుధాకర్ ఆధ్వర్యంలో కాపు వాడలోని గ్రామ పోచమ్మ, బొడ్రాయిని దర్శించుకుని కొబ్బరికాయలు కొట్టి బోనాలు సమర్పించడం జరిగింది. ఈ సందర్భంగా సర్పంచ్ గాదె స్రవంతి సుధాకర్ మాట్లాడుతూ ప్రత్యేక ఆనవాయితీగా కొలిచేటువంటి గ్రామ దేవత పోచమ్మ ను కొలిచి కొబ్బరికాయలు కొట్టి, బోనాలు సమర్పించి, పాడి పంటలు బాగా పండాలని, ఆవులు, కుటుంబ సభ్యులు చల్లగా ఉండాలని మొక్కులు చెల్లించుకోవడం జరిగింది. అనంతరం గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున ఊరేగింపుగా బోనాలు ఎత్తుకొని చెట్లు తీర్థాలకు వెళ్లడం జరిగింది. అనంతరం గ్రామ ప్రజలందరూ సాంప్రదాయాలను పాటిస్తూ మొక్కులు చెల్లించుకుని ఈ కార్యక్రమంలో పాల్గొనడం జరిగిందని సర్పంచ్ గాదె స్రవంతి సుధాకర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గాదె స్రవంతి సుధాకర్, గ్రామ ప్రజలు, పెద్దలు, మహిళలు, యువకులు,అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# బుచ్చంపేటలో 2026 SIR గణన సర్వే కార్యక్రమం

**మంగపేట జూలై 09డీడీ 9 వార్త**

బుచ్చంపేట గ్రామంలో 2026 SIR గణన సర్వే కార్యక్రమంలో భాగంగా గ్రామ బూత్ లెవల్ అధికారి మద్దెల లక్ష్మయ్య ఆధ్వర్యంలో గణన ఫారాలను స్వీకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేసే ప్రక్రియ నిర్వహించారు. ఈ సందర్భంగా బూత్ లెవల్ అధికారి మాట్లాడుతూ గ్రామంలోని ప్రతి ఓటరు తమకు అందజేసిన గణన ఫారాలను జాగ్రత్తగా, సరైన వివరాలతో నింపి తప్పనిసరిగా సమర్పించాలని సూచించారు. ఓటరు జాబితాలో సరైన వివరాలు నమోదవడం ద్వారా ప్రతి ఒక్కరి ఓటు హక్కు సురక్షితంగా ఉండాలని ఆయన తెలిపారు. అలాగే ఓటు హక్కు ప్రజాస్వామ్యంలో అత్యంత విలువైన హక్కు అని, దానిని కాపాడుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, స్థానిక ప్రతినిధులు మరియు సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.



# ప్రజల మనసును గెలిచిన నేత సీతక్క...

- **వెంకటాపురంలో ఘనంగా సీతక్క జన్మదిన వేడుకలు..**

**జూలై 09 డిడి9 వార్త వెంకటాపురం.**

రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క జన్మదిన వేడుకలను ములుగు జిల్లా వెంకటాపురం మండల కేంద్రంలో గురువారం కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా మంత్రి సీతక్క ప్రజల సంక్షేమం, గ్రామీణాభివృద్ధి, మహిళా సాధికారత కోసం నిరంతరం కృషి చేస్తూ రాష్ట్ర అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారని నాయకులు కొనియాడారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సయ్యద్ హుస్సేన్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి, పరస్పరం మిఠాయిలు పంచుకుని మంత్రికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

స్థానిక రోడ్లుభవనాల శాఖ అతిథి గృహం ఆవరణలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని మంత్రి సీతక్కకు దీర్ఘాయుష్షు, సంపూర్ణ ఆరోగ్యం కలగాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు ధనపనేని వెంకటేశ్వర్లు, మన్యం సునీల్, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు చిట్టెం సాయి, బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చిడెం సాంబశివరావు, వెంకటాపురం మేజర్ పంచాయతీ ఉపసర్పంచ్ సర్ఫుద్దీన్ సన్నీ, మైనార్టీ సెల్



మండల అధ్యక్షులు సయ్యద్ అన్వర్, కాంగ్రెస్ నాయకులు బాలసాని వేణు, సుంకరి రంగయ్య నాయుడు, జల్లి గంపల కళాధర్, కె. సుందర్ రావు, పల్నాటి ప్రకాశరావు, తోట శ్రీను, తిప్పని సమ్మయ్య, గుండమళ్ల కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి బూత్ లో బూత్ లెవెల్ ఆఫీసర్స్ (BLO) సంఖ్యను ఇంకా పెంచాలి..

- **ఎస్ ఐ ఆర్ కార్యక్రమం సక్రమంగా జరిగేలా చూడాలి..**
- **టిఆర్ఎస్ పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు.**

**మణుగూరు.జూలై 9(డి డి 9వార్త)**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా,మణుగూరు బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో గురువారం నాడు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కుర్రి నాగేశ్వరరావు, పట్టణ అధ్యక్షుడు కుంట లక్ష్మణ్ లు మాట్లాడుతూ.. మండలం లోని పలు చోట్ల పోలింగ్ బూత్ లలో సుమారు 1000 నుండి 1200 మంది వరకు ఓటర్స్ ను కలిగినటువంటి పరిస్థితి ఉందని, అలాంటప్పుడు ఒక్క బిఎల్వో ఎస్ ఐ ఆర్ ఫామ్స్ ను పంచడమే సుమారు 15 రోజుల నుంచి 20 రోజులు పడుతున్నటువంటి పరిస్థితి ఉన్నది. ఇలాంటి పరిస్థితులలో ప్రతి బూత్ కు ఇంకా ఇద్దరు బిఎల్వో లను పెంచి సులభంగా,వేగవంతంగా ఎస్ఐఆర్ ఫామ్స్ ఓటర్స్ కి అందజేసి, ఓటర్ దగ్గర నుండి నింపినటువంటి ఫామ్స్ ను తీసుకొని బిఎల్వోలు చాలా పకడ్బందీగా ఆన్లైన్ చేసినట్లయితేనే ప్రతి ఓటర్ కు ఓటు హక్కు వస్తుంది అని అన్నారు.ప్రస్తుతం మండలంలో చాలా మందకోడిగా ఎస్ఐఆర్ ప్రక్రియ జరుగుతుంది అని అన్నారు. ఇంకా 50 శాతం మంది ప్రజలకు ఈ ప్రక్రియ అర్థం కాకుండా అయోమయ పరిస్థితిలోనే ఉందని అన్నారు. కావున పై అధికారులు కూడా ఈ యొక్క విషయాన్ని సూక్ష్మ పరిశీలన చేసి ప్రతి ఒక్క ఓటరుకు ఎన్యూమరేషన్ ఫారం చేరి ఓటు హక్కు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలి అని అన్నారు.ఈ ప్రక్రియ మెరుగుపడాలి అంటే తప్పనిసరిగా ఇంకా అదనంగా బూత్ లెవెల్ ఆఫీసర్స్ ను నియమించాల్సిన అవసరం అధికారులపై ఉన్నదని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంకా బీఆర్ఎస్ పార్టీ నాయకులు ముత్యం బాబు,ఆడప అప్పారావు,మౌలానా, ముద్ధంగుల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



# అశ్వాపురం మండల నూతన బిఆర్ఎస్ పార్టీ కార్యాలయం ప్రారంభోత్సవం..

- **ప్రారంభించనున్న బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు.**

**మణుగూరు.జూలై 9(డి డి 9వార్త)**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా,అశ్వాపురం మండలం, గౌతమి నగర్ (HWP.M) కాలనీ గేట్ ఎదురుగా శుక్రవారం ఉదయం 10:17 నిమిషాలకు అశ్వాపురం మండల బిఆర్ఎస్ పార్టీ నూతన కార్యాలయం (తెలంగాణ భవన్) ప్రారంభోత్సవం జరుగుతుంది అని అశ్వాపురం మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కోడి అమరేందర్ యాదవ్ తెలియచేశారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి పినపాక నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు, బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు హాజరై నూతన కార్యాలయాన్ని ప్రారంభిస్తారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమం అనంతరం మారెళ్ళపాడు లిఫ్ట్ ఇరిగేషన్ పనులను పరిశీలించి,అనంతరం



కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేయడం జరుగుతుంది అని వారు పేర్కొన్నారు.

కాబట్టి ఈ కార్యక్రమానికి మండల బిఆర్ఎస్ పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, ఎస్సీ, ఎస్టీ, బిసి,మైనారిటీ నాయకులు, మహిళా,యువజన నాయకులు, పార్టీ కార్యకర్తలు,ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా మిత్రులు అందరూ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# రాష్ట్ర మంత్రివర్యులు సీతక్క జన్మదినాన్ని పురస్కరించుకుని, సారలమ్మ తల్లి పూజారి ఊరట్టం గ్రామ పంచాయితీ ఉప సర్పంచ్ కాక రంజిత్ సీతక్కకు చీరను బహుకరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు

**తాడ్వాయి మండలం (డిడి9 వార్త)**

ములుగు జిల్లాలో D L R ఫంక్షన్ హాల్ లో ఈ కార్యక్రమంలో సీతక్క యువసేన జిల్లా అధ్యక్షులు చర్ప రవీందర్ కాంగ్రెస్ పార్టీ తాడ్వాయి మండల మహిళా అధ్యక్షురాలు గొంది సరిత సోషల్ మీడియా కోఆర్డినేటర్ గజ్జెల రాజశేఖర్ , కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు జాలిగపు జంపన్న పబ్బోజు వెంకటాద్రి , గజ్జెల స్వామి , గజ్జెల సందీప్ తదితరులు పాల్గొని సీతక్కకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు




# బీఆర్ఎస్ కుటుంబానికి అండగా భూక్య జంపన్న .. దుఃఖంలో ఉన్న నాయకుడి కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సహాయం

**డీ డీ 9 వార్త, ములుగు , జూలై 9:**

కష్టసుఖాల్లో పార్టీ కార్యకర్తలు, నాయకులకు అండగా నిలవడమే నిజమైన నాయకత్వమని మరోసారి నిరూపించారు బీఆర్ఎస్ ములుగు నియోజకవర్గ జిల్లా నాయకులు భూక్య జంపన్న గారు. ములుగు జిల్లా,వెంకటాపురం మండలం, పాలంపేట గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు కనకం సంపత్ గారి కుమార్తె తేజశ్రీ (17) ఇటీవల స్వర్గస్తులయ్యారు ఈ విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ ములుగు నియోజకవర్గ జిల్లా నాయకులు భూక్య జంపన్న గారు, వారి నివాసానికి వెళ్లి మృతురాలికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ఈ సందర్భంగా తీవ్ర మనోవేదనలో ఉన్న కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి, వారి కష్టసమయంలో తాను అండగా ఉంటానని భరోసా కల్పించారు. అనంతరం కుటుంబానికి తనవంతు ఆర్థిక సహాయాన్ని అందజేసి మానవత్వాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో స్వామి గారు, రవీందర్ గారు, యూత్ అధ్యక్షులు ప్రశాంత్ గారు, మహమ్మద్ అఖిల్ గారు, పైడి గారు, రాజుగారు, అంజి గారు, కిషోర్ గారు, కళ్యాణ్ గారు, సందీప్ గారు, రాజు గారు, సాధిగారు, రామ్ గారు, బాబి గారు, వంశి గారు, గ్రామ పెద్దలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.




# భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కాంగ్రెస్ ఎస్సీ సెల్ సమావేశానికి ఏర్పాట్లు..

- **కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా చైర్మన్ గద్దల రమేష్ ఆధ్వర్యంలో సమావేశం.**

**మణుగూరు.జూలై 9(డి డి 9వార్త)**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రం లోని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి క్యాంప్ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా చైర్మన్ గద్దల రమేష్ ఆధ్వర్యంలో ఈనెల 18 వ తేదీన నిర్వహించనున్న కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ డెవలప్మెంట్ సమావేశం గురించి సన్నాహక సమావేశాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్సీ సెల్ జిల్లా చైర్మన్ గద్దల రమేష్ మాట్లాడుతూ.. ఈనెల 18 తేదీ జరగబోయే ఎస్సీ సెల్ డెవలప్మెంట్ సమావేశానికి టిపిసిసి ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యన్నారాయణ ముఖ్య అతిథిగా హాజరు అవుతున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఎస్సీ వర్గాల అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు, ప్రజలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలు, పార్టీ బలోపేతం వంటి అంశాలపై సమగ్రంగా చర్చించనున్నట్టు ఆయన వెల్లడించారు. ఇంకా ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జనరల్ సెక్రటరీ దీపంగి వెంకటరమణ మాట్లాడుతూ.. ఎస్సీ వర్గాల సమస్యలను రాష్ట్ర నాయకత్వం దృష్టికి తీసుకువెళ్లి, వాటి పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. అలాగే 18 వ తేదీన జరగబోయే సమావేశానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఎస్సీ సెల్ ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.




# కోల్ మైన్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ సింగరేణి శాఖ మణుగూరు ఏరియా అధికారుల రిలే నిరాహార దీక్షలకు మద్దతు తెలిపిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు..

- **ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్మన్‌గా నియామకంపై ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు కు సింగరేణి అధికారుల ఘన సన్మానం.**

**మణుగూరు.జూలై 9(డి డి 9వార్త)**

భద్రాద్రి జిల్లా, మణుగూరు సింగరేణి. కోల్ మైన్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ (CMOAI) సింగరేణి శాఖ మణుగూరు ఏరియా ఆధ్వర్యంలో అధికారులు తమ సమస్యల పరిష్కారం కోసం కొనసాగుతున్న 11వ రోజు రిలే నిరాహార దీక్షలకు పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సంఘీభావం ప్రకటించి మద్దతు తెలిపారు.ఈ సందర్భంగా సంఘం ప్రతినిధులు తమ ప్రధాన డిమాండ్లైన జీతాల అప్‌గ్రేడేషన్‌ను వెంటనే అమలు చేయడం, జీతంలో భాగమైన PRPను వెంటనే చెల్లించడం, పారదర్శకమైన ప్రమోషన్ పాలసీ అమలు చేయడం, సింగరేణికి రావాల్సిన బకాయిలను వెంటనే విడుదల చేయడం తదితర అంశాలను ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు దృష్టికి తీసుకువచ్చారు.

దీనిపై స్పందించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ, సింగరేణి అధికారుల న్యాయమైన డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేందుకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరియు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తో ఈ అంశాలపై ప్రత్యేకంగా చర్చించి, అధికారుల సమస్యలు సత్వరమే పరిష్కారమయ్యేలా కృషి చేస్తానని తెలిపారు. సింగరేణి సంస్థ అభివృద్ధిలో అధికారులు, కార్మికుల పాత్ర ఎంతో కీలకమని పేర్కొంటూ, వారి సంక్షేమం, న్యాయమైన హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తుందనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు.అనంతరం మణుగూరు ఏరియా జీఎం కార్యాలయంలో, తెలంగాణ రాష్ట్ర శాసనసభ షెడ్యూల్డ్ తెగల సంక్షేమ కమిటీ (ఎస్టీ) చైర్మన్‌గా నియమితులైన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుని జీఎం మరియు పర్సనల్ డీజీఎం ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించి, ఎమ్మెల్యేకు




లభించిన ఈ బాధ్యత గిరిజనుల సంక్షేమం, అభివృద్ధికి మరింత దోహదపడాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, తనపై ఉంచిన విశ్వాసానికి అనుగుణంగా గిరిజనుల అభివృద్ధి, సంక్షేమం కోసం అంకితభావంతో పనిచేస్తానని, ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ నాయకులు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు, టౌన్ కాంగ్రెస్ అధ్యక్షులు, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు, జీఎం కార్యాలయ అధికారులు, పర్సనల్ విభాగం అధికారులు, సింగరేణి అధికారులు, కోల్ మైన్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో సింగరేణి అధికారులు పాల్గొన్నారు.

# భద్రాచలం వద్ద 'పోలవరం' బ్యాక్ వాటర్ ప్రభావంపై నిపుణుల అధ్యయనం

- **కరకట్టల పటిష్టత, స్లూయిస్‌ల సామర్థ్యంపై ఇంజినీర్ల బృందం పరిశీలన**
- **కేంద్ర జలశక్తి శాఖకు సమగ్ర నివేదిక**

**భద్రాచలం టౌన్ , జూలై 9 ( డిడి9 వార్త )**

భద్రాచలంకు పోలవరం ప్రాజెక్టు పూర్తయితే నీటి నిల్వ వలన ఎంత మేరకు ప్రభావం ఉంటుంది! పట్టణంలోని కరకట్ట రక్షణ చర్యలకు తీసుకోవాల్సిన అంశాలు, స్లూయిస్లను మరింతగా పటిష్టం ఎలా చేయాలి అనే అంశాలపై పోలవరం పరిరక్షణ కమిటీ గురువారం క్షేత్రస్థాయిలో అధ్యయనం చేసింది. పోలవరం ప్రాజెక్టు ప్రభావిత ప్రాంతాల పరిశీలనలో భాగంగా కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు పోలవరం ప్రాజెక్టు అథారిటీ డైరెక్టర్ ఎన్‌వి సతీష్ శామకుర్తి, డిప్యూటీ డైరెక్టర్ అన్నెపు ప్రవీణ్, సభ్యులతో కూడిన పోలవరం పరిరక్షణ కమిటీకీ చెందిన ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల ఇంజనీర్ల బృందం భద్రాచలంలో పర్యటించింది. ఈ సందర్భంగా బృందం భద్రాచలం వద్ద తొలుత గోదావరి కరకట్టతో పాటు పరిసర ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించింది. విస్తా కాంప్లెక్సు వద్ద కరకట్ల స్లూయిస్ వద్ద వరదను తట్టుకునే విధంగా భారీ మోటార్లను ఏర్పాటు చేసేలా పరిశీలన చేశారు. అలాగే రామాలయం పరిసరాల్లోకి ఆకస్మాత్తుగా వరద వస్తే తీసుకుంటున్న రక్షణ చర్యలతో పాటు పోలవరం బ్యాక్ వాటర్ ప్రభావంపై పరిశీలన చేశారు. అదేవిధంగా అశోకనగర్ కాలనీ కొత్తకాలనీ స్లూయిస్ వద్ద కరకట్టను పటిష్టం చేయడంతో పాటు స్లూయిస్ను మరింతగా అభివృద్ధి చేసేవిధంగా తీసుకోవాల్సిన చర్యలను పరిశీలించారు. పోలవరం ప్రభావంతో ఎంత మేరకు పట్టణంలోని కాలనీలకు నష్టం ఏర్పడుతుందని దానిని అరికట్టేందుకు కరకట్ట వద్ద తీసుకువాల్సిన చర్యలపై ఇంజనీర్ల బృందం చర్చించింది. అదేవిధంగా ఆంధ్రా పరిధిలోని కరకట్టను మరింత పటిష్టం



గా చేయడంతో పాటు పడపోయిన రిటైనింగ్ వాల్‌ను కొత్తగా నిర్మించాలని ఏపీ ప్రభుత్వ ఇంజనీర్లు నిర్ణయించారు. అలాగే క్షేత్రస్థాయి పరిశీలనలో సేకరించిన వివరాలు, సాంకేతిక అంశాల ఆధారంగా సమగ్ర నివేదికను రూపొందించి కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖకు సమర్పించనున్నట్లు వారు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఇంజనీర్ల బృందం సభ్యులు ఏపీకి చెందిన దామోదరం, కొత్తగూడెంకు చెందిన సయ్యద్ హమీద్ జానీ, ఆర్.శ్రవంతి, సందీప్ వేములతో పాటు స్థానిక ఇంజనీరింగు అధికారులు పాల్గొన్నారు.

# ప్రపంచంలోనే అతిపెద్ద విద్యార్థి సంస్థ ఏబీవీపీ.అజయ్ కన్వినర్.

**డిడి9వార్త / పెద్దపల్లి జులై 10:**

అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) గోదావరిఖని శాఖ ఆధ్వర్యంలో జాతీయ విద్యార్థి దినోత్సవం మరియు 78వ ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఏబీవీపీ జెండా ఆవిష్కరించడం జరిగింది.

ఈ సందర్భంగా కరీంనగర్ విభాగ్ కన్వినర్ అజయ్ మాట్లాడుతూ 1949 జూలై 9న ఆవిర్భవించిన అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ నేడు ప్రపంచంలోనే అతిపెద్ద విద్యార్థి సంస్థగా ఎదిగి దేశవ్యాప్తంగా కోట్లాది మంది విద్యార్థులను చైతన్యవంతం చేస్తోందన్నారు. గత *78 సంవత్సరాలుగా* విద్యార్థుల హక్కుల పరిరక్షణ, నాణ్యమైన విద్య కోసం ఉద్యమాలు, జాతీయ పునర్నిర్మాణం, సామాజిక సేవ, నాయకత్వ వికాసం వంటి రంగాల్లో ఏబీవీపీ విశేష సేవలు అందిస్తోందని తెలిపారు."జ్ఞానం శీలం ఏకత" అనే త్రిసూత్రం ఏబీవీపీకి మార్గదర్శకమని, జ్ఞానం వ్యక్తిత్వ వికాసానికి, శీలం సమాజ విశ్వాసానికి, ఏకత దేశ సమగ్రతకు ప్రతీకలని అన్నారు. విద్యార్థి కేవలం ఉద్యోగం కోసం చదివే వ్యక్తి కాకుండా, దేశ భవిష్యత్తును నిర్మించే బాధ్యతగల పౌరుడిగా ఎదగాలని ఏబీవీపీ నిరంతరం కృషి చేస్తోందని పేర్కొన్నారు.విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు, నాణ్యమైన విద్య, పారదర్శక విద్యా విధానం, అవినీతి నిర్మూలన, క్యాంపస్ అభివృద్ధి వంటి అంశాలపై ఏబీవీపీ అనేక ఉద్యమాలు చేపట్టిందన్నారు. అలాగే సామాజిక సేవలో భాగంగా రక్తదాన శిబిరాలు, పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలు, విపత్తుల సమయంలో సహాయక చర్యలు, సైబర్ సెక్యూరిటీ అవగాహన, డ్రగ్స్ నిర్మూలన కార్యక్రమాలను నిర్వహిస్తూ సమాజంలో విశిష్టమైన సేవలు అందిస్తోందని తెలిపారు.అత్యవసర పరిస్థితి (ఎమర్జెన్సీ) సమయంలో ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం వేలాది మంది ఏబీవీపీ కార్యకర్తలు జైలు శిక్షలను సైతం ఎదుర్కొన్నారని గుర్తు చేశారు. దేశ సమైక్యత, జాతీయ భద్రత, సరిహద్దుల రక్షణ, అక్రమ చొరబాట్ల నియంత్రణ వంటి జాతీయ అంశాలపై కూడా ఏబీవీపీ ఎప్పటికప్పుడు తన గళాన్ని వినిపిస్తోందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఏబీవీపీ విభాగ్ కన్వినర్ అజయ్, నాయకులు రుషిక్, ఆదిత్య, విద్యార్థులు మరియు తదితరులు పాల్గొనారు.



# ప్రజా సమస్యలపై పోరుకు సిద్ధం కావాలి

- **కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలి**
- **భద్రాచలంలో సీపీఐ రాజకీయ శిక్షణ తరగతుల్లో జాతీయ సమితి సభ్యులు భాగం హేమంతరావు**
- **కమ్యూనిస్టుల పోరాటాలతోనే సమ సమాజ స్థాపన: ఎమ్మెల్యే కూనమనేని**

**భద్రాచలం, జూలై 9 (డిడి9 వార్త)**

రానున్న రోజుల్లో విస్తృతస్థాయిలో ప్రజా ఉద్యమాలకు సీపీఐ శ్రేణులు సిద్ధం కావాలని ఆ పార్టీ జాతీయ సమితి సభ్యులు భాగం హేమంతరావు పిలుపునిచ్చారు. భద్రాచలంలో గురువారం నిర్వహించిన సీపీఐ రాజకీయ శిక్షణ తరగతుల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల వల్ల సామాన్యులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వీటిని ప్రజల్లోకి తీసుకెళ్లి నిలదీయాలని సూచించారు.

పోరాటాలే పార్టీకి ఊపిరి

పెరుగుతున్న ధరలు, నిరుద్యోగం, రైతాంగ సంక్షోభం, ప్రభుత్వ రంగ సంస్థల నిర్వీర్యంపై ప్రజలను చైతన్యపరిచి ఉద్యమాలను ఉద్ధృతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి గ్రామం, వార్డు, మండల స్థాయిలో పార్టీ కమిటీలను చురుకుగా పనిచేసేలా చూడాలని, సభ్యత్వ నమోదును ముమ్మరం చేసి యువత, మహిళలు, కార్మికులు, రైతులను పార్టీ వైపు ఆకర్షించాలని హేమంతరావు దిశానిర్దేశం చేశారు. తాగునీరు, రహదారులు, విద్య, వైద్యం వంటి స్థానిక సమస్యలపై నిరంతరం పోరాడాలని, అవసరమైతే అధికారులపై ప్రజాస్వామ్యబద్ధంగా ఒత్తిడి తీసుకురావాలని సూచించారు.

సమ సమాజం కమ్యూనిస్టులతోనే సాధ్యం

ఈ కార్యక్రమంలో పాల్గొన్న కొత్తగూడెం ఎమ్మెల్యే కూనమనేని సాంబశివరావు మాట్లాడుతూ.. ప్రపంచవ్యాప్తంగా సామాజిక సమానత్వం కోసం అనేక దేశాలు కమ్యూనిజం వైపు చూస్తున్నాయన్నారు. "పేదలు, రైతులు, కార్మికులు, బడుగు బలహీన వర్గాల హక్కుల పరిరక్షణ కోసం ఎంతటి పోరాటాలకైనా కమ్యూనిస్టులు సిద్ధం. పేదల భూములను లాక్కోవడం అన్యాయం.. దీనిని సహించబోం" అని హెచ్చరించారు. దేశ స్వాతంత్ర్యం, ప్రజాస్వామ్య విలువలు, ప్రజల హక్కుల పరిరక్షణ కోసం నిరంతరం పోరాడుతున్న నిజమైన దేశభక్తులు కమ్యూనిస్టులేనని ఆయన స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల కార్యదర్శులు ఎస్.కె. సాబీర్ పాషా, దండి సురేష్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం, కల్లూరు వెంకటేశ్వర్లు, జమ్ముల జితేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.






# తూటాల్లా దూసుకు వస్తున్న రాళ్లు.

- **ఇసుక లారీల బీభత్సం..**
- **ప్రజల ప్రాణాలతో చెలగాటం..**
- **ప్రమాదం జరిగి ప్రాణాలు పోతే బాధ్యత ప్రభుత్వానిదే!**

**జూలై09 డిడి9 వార్త వెంకటాపురం.**



వెంకటాపురం మండలంలో ఇసుక లారీల నిర్లక్ష్యపు రాకపోకలు, అధికారుల అలసత్వం కారణంగా ప్రజల ప్రాణాలు నిత్యం ప్రమాదంలో పడుతున్నాయి. ఇసుక లారీలతో దెబ్బతిన్న రహదారులకు మరమ్మతుల పేరుతో చిప్స్ రాళ్లు పోసి పనులను మధ్యలోనే వదిలేయడంతో, వేగంగా వెళ్తున్న లారీల చక్రాల కింద నుంచి రాళ్లు తూటాల్లా ఎగిరి ప్రయాణికులపై పడుతున్నాయి. ముఖ్యంగా మండల కేంద్రంలో గల ఎన్టీఆర్ సెంటర్ మూలమలుపు వద్ద పెద్ద గొయ్యిగా ఏర్పడ్డ రోడ్డు పైన హడావిడిగా విడిచిప్స్ రాళ్లు పోసి గోయిని పూడ్చడంతో అధికలోడుతో ప్రయాణిస్తున్న లారీల బరువు వలన వాటి చక్రాల కింద నుంచి రాళ్లు ఎగిరి దూసుకు వస్తున్నాయి.

ప్రతి రోజు విద్యార్థులు, మహిళలు, వృద్ధులు, ద్విచక్ర వాహనదారులు తీవ్ర భయాందోళనల మధ్య ప్రయాణిస్తున్నారు. ఇప్పటికే పలువురు గాయపడినా సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్లు, ప్రజాప్రతినిధులు స్పందించకపోవడం అత్యంత దురదృష్టకరం. ప్రజల ప్రాణాల కంటే ఇసుక రవాణాకే ప్రాధాన్యత ఇస్తున్న ప్రభుత్వ వైఖరి తీవ్రంగా ఖండనీయం. ఒకవేళ ఈ నిర్లక్ష్యం కారణంగా ప్రాణ నష్టం జరిగితే దానికి పూర్తి బాధ్యత సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్లు మరియు ప్రభుత్వానిదేనని మండల ప్రజలు హెచ్చరిస్తున్నారు.


వెంటనే రోడ్డుపై ఉన్న చిప్స్ రాళ్లను తొలగించి, నాణ్యమైన రహదారి మరమ్మతులు చేపట్టాలని, ఇసుక లారీల వేగాన్ని నియంత్రించాలని, నిబంధనలు ఉల్లంఘిస్తున్న వాహనాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

లేనిపక్షంలో ప్రజలను సమీకరించి భారీ స్థాయిలో ఆందోళనలు, రాస్తారోకోలు, ధర్నాలు నిర్వహించేందుకు వెనుకాడబోమని మండల ప్రజలు స్పష్టం చేశారు. ప్రజల ప్రాణాలను కాపాడడం ప్రభుత్వ ప్రథమ బాధ్యత అని, ప్రమాదం జరిగిన తర్వాత స్పందించడం కాదు, ప్రమాదాన్ని ముందే నివారించాలని వారు ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

# భద్రాద్రి రామయ్యను దర్శించుకున్న ఎంపీ పోరిక బలరాంనాయక్

**భద్రాచలం టౌన్ , జూలై 9 , (డిడి9 వార్త)**

భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారిని గురువారం మహబూబాద్ ఎంపీ పోరిక బలరాంనాయక్ దర్శించుకున్నా. ఈ సందర్భంగా ఆయనకు దేవస్థానం ఈవో కె.దామోదర్‌రావు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో జరిగిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం ఎంపీకి బలరాంనాయక్‌కు వైదిక సిబ్బంది వేద ఆశీర్వచనం అందజేశారు. అలాగే నిత్యకల్యాణ మండపంలో స్వామి వారి నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. విశ్వక్సేనార్చన, పుణ్యహావచనం, కంకణదారణ, జీలకరబెల్లం, మాంగల్యదారణ, తలంబ్రాలు, వేద ఆశీర్వచనం నిర్వహించారు.



# గవర్నర్‌కు ఎంపీ కడియం కావ్య ఘన స్వాగతం

**జనగామ జులై 9(డిడి 9వార్త )బ్యూరో**

హనుమకొండ: వరంగల్ పర్యటనలో భాగంగా ఎన్‌ఐటీ వరంగల్‌కు వచ్చిన తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లకు వరంగల్ ఎంపీ కడియం కావ్య ఘన స్వాగతం పలికారు. పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించిన ఆమె, అనంతరం గవర్నర్‌తో సమావేశమై వరంగల్ అభివృద్ధి, విద్యా రంగ పురోగతి పై చర్చించారు. కార్యక్రమానికి హాజరైన మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కు కూడా స్వాగతం తెలిపారు.





## 100వ టీ20కి చేరువలో అక్షర్ పటేల్.. ఊహించలేదంటూ భావోద్వేగ వ్యాఖ్యలు

- ఊహించని మైలురాయిగా అభివర్ణించిన అక్షర్
- ఈ ఘనత అందరిదంటూ వ్యాఖ్యలు
- ఇటీవలే టీ20లో 100 వికెట్లు పూర్తి
- 2021 నుంచి వరుస అవకాశాలు వచ్చినట్లు వెల్లడి
- గత 2 టీ20 ప్రపంచకప్‌ల్లోనూ ఆడటం మరపురాని జ్ఞాపకాలన్న అక్షర్

**డిడి9 వార్త:**

భారత్ ఆల్‌రౌండర్ అక్షర్ పటేల్ కెరీర్‌లో మరో అరుదైన ఘట్టం చేరువైంది. ఇంగ్లండ్‌తో జరిగే నాలుగో టీ20లో బరిలోకి దిగితే అతను భారత్ తరఫున 100వ టీ20 మ్యాచ్ ఆడిన ఆటగాడిగా నిలుస్తాడు. ఈ సందర్భంగా తన క్రికెట్ ప్రయాణాన్ని గుర్తు చేసుకుంటూ అక్షర్ భావోద్వేగానికి గురయ్యాడు.

టీ20ల్లో అరంగేట్రం చేసినప్పుడు 100 మ్యాచ్‌లు ఆడతానని అసలు ఊహించలేదని అక్షర్ చెప్పాడు. ఇంగ్లండ్ పర్యటన తనకు ఎప్పటికీ గుర్తుండిపోతుందని అన్నాడు. ఇదే సిరీస్‌లో రెండో టీ20లో 100 వికెట్ల మైలురాయిని అందుకున్నానని, ఇప్పుడు 100వ మ్యాచ్ ఆడబోతుండటం మరింత ప్రత్యేకంగా అనిపిస్తోందని బీసీసీఐ విడుదల చేసిన వీడియోలో వెల్లడించాడు.

ఈ ఘనత తన ఒక్కడిదే కాదని అక్షర్ స్పష్టం చేశాడు. తన ప్రయాణంలో సహచర ఆటగాళ్లు, కోచ్‌లు, కుటుంబ సభ్యులందరి పాత్ర ఉందని చెప్పాడు. ఒక ఆటగాడికి భారత్ తరఫున ఒక్క మ్యాచ్ ఆడటమే గొప్ప విషయమని, అలాంటిది 100 మ్యాచ్‌లు ఆడే అవకాశం రావడం ప్రతి క్రికెటర్‌కు కల నిజమవడమేనని పేర్కొన్నాడు.

2015లో టీ20ల్లో అరంగేట్రం చేసిన అక్షర్‌కు తొలి ఐదారేళ్లలో ఎక్కువ అవకాశాలు రాలేదు. ఆ సమయంలో కేవలం 1516 మ్యాచ్‌లే ఆడానని గుర్తు చేసుకున్నాడు. 2021 నుంచి జట్టులో వరుస అవకాశాలు దక్కాయని, గత రెండు టీ20 ప్రపంచకప్‌ల్లోనూ ఆడటం తన కెరీర్‌లో మరపురాని జ్ఞాపకాలుగా నిలిచాయని తెలిపాడు.

వ్యక్తిగత మైలురాళ్ల కంటే ఆటలో రోజూ మెరుగుపడటానికే తాను ఎక్కువ ప్రాధాన్యం ఇస్తానని అక్షర్ అన్నాడు. ఎన్నో తప్పిదాల నుంచి పాఠాలు నేర్చుకున్నానని, అనుభవంతో ఒత్తిడిని ఎదుర్కోవడం కూడా సులభమైందని చెప్పాడు. కెరీర్ ప్రారంభ దశ నాటి అక్షర్‌కు సలహా ఇవ్వాల్సి వస్తే.. తప్పుల నుంచి ఎంత త్వరగా నేర్చుకుంటే అంత మంచిదని చెబుతానని పేర్కొన్నాడు.

## 'తిలక్‌కు బదులు సంజూనే ఆడించాలి'.. టీమిండియాపై కృష్ణమాచారి శ్రీకాంత్ ఘాటు విమర్శలు

- ఇంగ్లండ్ టీ20 సిరీస్‌లో టీమిండియా వరుస పరాజయాలు
- తిలక్‌ను ఎందుకు కాపాడుతున్నారంటూ శ్రీకాంత్ ప్రశ్న
- అతడికి షార్ట్ పిచ్ బంతులు బలహీనత అని కూడా తెలుసని వ్యాఖ్య
- తప్పుడు సంకేతాలు వెళతాయని హెచ్చరిక

**డిడి9 వార్త:**

ఇంగ్లండ్‌తో టీ20 సిరీస్‌లో టీమిండియా వరుస పరాజయాలు చవిచూస్తుండటంతో జట్టుపై విమర్శలు పెరుగుతున్నాయి. ముఖ్యంగా వైస్ కెప్టెన్ తిలక్ వర్మ ఆటతీరు నిరాశపరుస్తోందంటూ భారత మాజీ కెప్టెన్ కృష్ణమాచారి శ్రీకాంత్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. తిలక్‌కు బదులుగా సంజూ శాంసన్‌ను జట్టులోకి తీసుకోవాలని సూచించారు.

తన యూట్యూబ్ ఛానెల్‌లో మాట్లాడిన శ్రీకాంత్.. "తిలక్ వర్మ పూర్తిగా అయోమయంలో ఉన్నాడు. అతని స్థానంలో నేను సంజూ శాంసన్‌కే అవకాశం ఇస్తాను. వైస్ కెప్టెన్‌గా నియమించిన ఆటగాణ్ని ఎందుకు కాపాడుతున్నారు?" అని ప్రశ్నించారు. తిలక్‌కు షార్ట్ పిచ్ బంతులు బలహీనత అని తెలిసే అక్షర్ పటేల్‌ను ముందుగా బ్యాటింగ్‌కు పంపుతున్నారని, జట్టు యాజమాన్యం తప్పుడు సంకేతాలు ఇస్తోందని విమర్శించారు.

వైస్ కెప్టెన్‌గా ఎంపికైన తర్వాత తిలక్ వర్మ 19, 55, 13, 24 నాటౌట్, 3 పరుగులు మాత్రమే చేశాడు. ఐర్లాండ్‌పై చేసిన 55 పరుగుల ఇన్నింగ్స్ మినహా అతడు ప్రభావం చూపలేకపోయాడు. ఇంగ్లండ్ పర్యటనలోనూ బ్యాటింగ్ విభాగం వరుసగా విఫలమవుతుండటంతో జట్టు ఎంపిక, నాయకత్వ నిర్ణయాలపై విమర్శలు మరింత పెరుగుతున్నాయి.







# జాతీయ భావజాలంతో విద్యార్థులంతా ముందుకు పోవాలి

- ఏబీవీపీ వరంగల్ విభాగ్ కన్వీనర్ ఆరెపల్లి సుజిత్

**డీ డీ 9 వార్త, ములుగు :**

అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ములుగు శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులతో మహా ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా వరంగల్ విభాగ్ కన్వీనర్ ఆరెపల్లి సుజిత్ మాట్లాడుతూ ఏబీవీపీ 77 సంవత్సరాలు నుంచి జాతీయ భావజాలంతో నిరంతరం విద్యారంగ సమస్యలే కాకుండా విద్యార్థులకు జాతీయ భావజాలం నింపుతూ దేశంలోనే నెంబర్ వన్ ఆర్గనైజేషన్ కేవలం అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ మాత్రమే మరియు పరాయి దేశపు సిద్ధాంతంతో దేశంలో అలజడుస్తున్న కాలంలో ఎన్న సిద్ధాంతపరమైన పోరులో ఎంతోమంది కార్యకర్తలు పోగొట్టుకున్న కానీ క్షణం క్షణం మా కణం కణం భరతమాతకే సమర్పణం అంటూ నిరంతరం విద్యారంగ సమస్యలు జాతీయ భావజాలం ముందుకు పోతున్న ఏబీవీపీ అని మరి విద్యార్థులందరూ కూడా విద్యార్థి పరిషత్ యొక్క ఆలోచనతో ముందుకు పోవాలని తెలియజేయడం జరిగింది ఈ కార్యక్రమంలో ములుగు పట్టణ కార్యదర్శి సాయిరాం, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్రీనాథ్, రజనీకాంత్, మరియు నవీన్, రోహిత్, ముఖేష్, మణికంఠ శివ సాయి, సాత్విక్, తల్లిదండ్రులు పాల్గొన్నారు.





## హామీలు అమలు చేయకపోతే ఉద్యమం తీవ్రతరం: గోపి రజక

**జనగామ జులై 9(డిడి 9వార్త )బ్యూరో**

హుజూర్‌నగర్‌లో నిర్వహించిన తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి జిల్లా ముఖ్యనాయకుల సమావేశంలో రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలన్న డిమాండ్ మరోసారి వినిపించింది. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని రాష్ట్ర అధ్యక్షులు గోపి రజక కోరారు. హామీలు అమలు కాకపోతే ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని జిల్లా అధ్యక్షులు గూడెపు నాగలింగం హెచ్చరించారు. రజకుల సామాజిక, ఆర్థిక వెనుకబాటుతనాన్ని గుర్తించి ఎస్సీ జాబితాలో చేర్చేందుకు స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమావేశంలో పలువురు జిల్లా, మండల నాయకులు పాల్గొన్నారు.

## డ్రైనేజీ సమస్యను పరిష్కరించండి మహాప్రభో

**(డిడి9వార్త ) మేడ్చల్:**

సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మేడ్చల్ లోని 297 వ డివిజన్ పరిధిలో నేషనల్ హైవే 44 ను ఆనుకొని వినాయక నగర్ ముఖ ద్వారం వద్ద గత 3, నెలలుగా పొంగి పొర్లుతున్న డ్రైనేజీ అనునిత్యం వేలాది మంది బాటసారులు,వాహనదారులకు ఇబ్బందులు జరుగుతున్నా స్పందించని కార్పొరేషన్ అధికారుల తీరు పట్ల బీజేపీ నాయకుల ఆగ్రహం వ్యక్తం చేస్తూ నిరసన చేపట్టారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచ నగరంగా తీర్చి దిద్దుతామని ప్రగల్భాలు పలుకుతూ మున్సిపాలిటీగా ఉన్న మేడ్చల్ ప్రాంతాన్ని గ్రేటర్ మున్సిపల్ కార్పొరేషన్ లో కలిపి ప్రజల జీవితాలతో ఆటలాడుతూ నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించడం హేయనీయం అని దుయ్యబట్టారు...

ఇప్పటికైనా ఈ సమస్య పట్ల వెంటనే స్పందించి సమస్య పరిష్కారం చూపకపోతే బీజేపీ నేతృత్వంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని పేర్కొన్నారు....

ఈ కార్యక్రమంలో బీజేపీ డివిజన్ ప్రధాన కార్యదర్శి జకట ప్రేమ్ దాస్,ఉపాధ్యక్షులు మైసరి రాజు,కోశాధికారి ఉపేందర్ గుప్తా,సీనియర్ నాయకులు చెరువుకొమ్ము శ్రీనివాస్ గౌడ్,రాఘవ రెడ్డి, నెమూరి శ్రీనివాస్ గౌడ్,వంశీధర్ రెడ్డి,గోపు నాగరాజు, పికెట్ మల్లికార్జున్ కాలని ప్రజలు తదితరులు పాల్గొన్నారు.




## ప్రజా సమస్యలను గాలికొదిలేసిన కాంగ్రెస్ ప్రభుత్వం -- మానే రామకృష్ణ

- కేసీఆర్ పాలనలోనే తెలంగాణ సుభిక్షం
- భద్రాచలంలో బీఆర్ఎస్ వార్డు స్థాయి సమావేశం

**భద్రాచలం, జూలై 9 (డిడి9 వార్త)**

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సమస్యలను గాలికొదిలేసి పాలన సాగిస్తోందని, ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్ నియోజకవర్గ నాయకులు మానే రామకృష్ణ ధ్వజమెత్తారు. భద్రాచలం పట్టణంలోని 16వ వార్డులో కాపుల నవీన్ అధ్యక్షతన జరిగిన బీఆర్ఎస్ పార్టీ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా మానే రామకృష్ణ మాట్లాడుతూ.. కేసీఆర్ పదేళ్ల పాలనలో తెలంగాణ సుభిక్షంగా, స్వర్ణయుగంగా వర్ధిల్లిందని కొనియాడారు. నేడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ సర్కార్ హామీల అమలులో చేతులెత్తేసి, ప్రజా క్షేత్రాన్ని విస్మరించిందని విమర్శించారు. ఏ కష్టం వచ్చినా ప్రజలకు అండగా నిలిచేది గులాబీ జెండా మాత్రమేనని, రాబోయే రోజుల్లో రాష్ట్రంలో మళ్లీ గులాబీ జెండానే ఎగురుతుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో మండల పార్టీ నాయకులు ఆకోజు సునీల్ కుమార్, కాపుల సూరిబాబు, పసుపులేటి రమేష్, దానియేలు ప్రదీప్, కొల్లిపాక శివ, రావూరి రవికిరణ్, మహిళా నాయకులు కావూరి సీతమహాలక్ష్మి, ఎండీ ముంతాజ్, నర్సమ్మ, కాపుల సుకన్య తదితరులు పాల్గొన్నారు




## రాత్రి వేళ బస్సుల కొరత.. ప్రయాణికుల తీవ్ర అవస్థలు.

**డిడి9వార్త / పెద్దపల్లి జులై 10:**

కరీంనగర్ ఆర్టీసీ బస్టాండ్‌లో రాత్రి 7 గంటలు దాటిన తర్వాత గోదావరిఖని, మంథని, మంచిర్యాల, ఆసిఫాబాద్ ప్రాంతాలకు వెళ్లే బస్సుల సంఖ్య గణనీయంగా తగ్గిపోతుండటంతో ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. కరీంనగర్ నుంచి ఆయా ప్రాంతాలకు వెళ్లే ఆర్టీసీ బస్సులు రాత్రి వేళల్లో అందుబాటులో లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మహిళలు, చిన్నారులు, వృద్ధులు గంటల తరబడి బస్టాండ్‌లో బస్సుల కోసం నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొంది.

పగటి వేళల్లో ఆయా డిపోలకు చెందిన బస్సులు అధిక సంఖ్యలో తిరుగుతున్నప్పటికీ, రాత్రి వేళల్లో మాత్రం సరిపడా సర్వీసులు లేకపోవడంతో ప్రయాణికులు బస్టాండ్‌లోనే వేచి ఉండాల్సి వస్తోంది. ఉద్యోగులు,విద్యార్థులు,అత్యవసర పనుల నిమిత్తం ప్రయాణించే వారు బస్సులు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ముఖ్యంగా మహిళలు,చిన్నారులు, వృద్ధులు రాత్రి వేళల్లో గంటల తరబడి నిరీక్షించాల్సి రావడం ఆందోళన కలిగిస్తోంది. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా రాత్రి వేళల్లో అదనపు బస్సులను నడపాలని, గోదావరిఖని, మంథని, మంచిర్యాల, ఆసిఫాబాద్ మార్గాల్లో సర్వీసులను పెంచాలని ప్రయాణికులు ఆర్టీసీ అధికారులను కోరుతున్నారు.



This newspaper/periodical is published by BATHULA KUMAR RAJA from PLOT 620, ROAD NO. 34, SURVEY OF INDIA AYYAPPA SOCIETY, CHANDA NAIK NAGAR, MADHAPUR, RANGAREDDY, TELANGANA - 500201. on behalf of BATHULA KUMAR RAJA, edited by BATHULA KUMAR RAJA and printed by NAGAVARAM SREENIVAS RAO at GARUDA PRINTERS, at H.NO.2-86/1, PLOT NO 26-SP, SY NO 420, SAGAR HIGH WAY, RAGANNAGUDA VILLEGE, ABDULLAPUR MANDAL, RANGAREDDY, TELANGANA - 502510.